# జీవన సంగీతం (పెద్దకథ)

తెలతెల వారుతోంది.

వంటయింట్లో తల్లి చేసే గిన్నెల చప్పుడు విన్పిస్తోంది.

పక్కవాటాలో వున్న బామ్మగారు వల్లించే వెంకటేశ్వర సుప్రభాతం విన్పిస్తోంది.

రేవతికి మెలుకవ వచ్చి ఈ శబ్దాలని ఆలకించసాగింది.

రేడియోలోనించి భక్తిరంజని విన్పిస్తూవుంది.

"అమ్మగారూ! నాపని అయింది చాపోయండమ్మా నే పోవాలి" పనిమనిషి అప్పి పెరట్లోంచి అరుస్తోంది.

"వుండవే ఒక్క క్షణం పాలుకాస్తున్నాను" వంట గదిలోనించి తల్లి గొంతు.

"ముందు నాకిచ్చేది వుందా లేదా. పాలు తెచ్చి అర్ధగంట అయింది" తండ్రి విసుగు

"ఒసే కమలా! నువ్వు ఒక్కదానివీ అన్ని పనుల్లో సతమత మవకపోతే రేవతిని లేపకూడదూ. యెదిగిన ఆడపిల్ల ఏడుగంటలయినా నిద్ర మంచంమీదనించి దిగదు. ఏం అలవాట్లే తల్లీ. నీ పెంపు యేం బాగాలేదే." అమ్మమ్మ తల్లిని మెత్త మెత్తగా చివాట్లు పెట్టడం విన్పిస్తోంది. రేవతికి ఒళ్ళు మండింది. చివాలున లేచి కూర్చుంది.

ఈరోజు ఏవారం! గుర్తులేదు.

ఈరోజు యేతారీఖు! అదీ గుర్తులేదు.

వారం తెల్సినా తారీఖు తెల్సుకోవచ్చు. తారీఖుతెల్సినా వారం తెల్సుకోవచ్చు. కానీ రెండూ తెలియకుంటే, క్యాలెండర్ చూసి ప్రయోజనం! అనుకుంది.

"అమ్మమ్మా యివాళ యేంవారం?" కేక పెట్టింది.

"చదువుకున్న వాళ్ళకంటే చాకలి మేలన్నట్లు వారం తారీఖు మూలనున్న ముసలిదాన్ని నన్నా అడగటం. అయినా గుర్తు చేసుకుని చెప్తానువుండు. మొన్న మీ నాన్న రాత్రి భోజనం చేయలేదంటే గురువారం నిన్న మీఅమ్మ తలంటుకుందంటే శుక్రవారం..."

"ఇంక చెప్పకు. ఈ రోజు పక్కవాటాలోని బామ్మగారు వెంకటేశ్వర సుప్రభాతం చదువుతున్నారు కనుక శనివారం" అంటూ క్యాలెండర్‌వైపు చూసి వులిక్కిపడింది జె అండ్ జె కంపెనీలో ఇంటర్వ్యూ వున్నదని గుర్తు పెట్టుకున్న పదహారో తారీఖు ఈరోజునే. రేవతి చప్పున లేచింది. త్వర త్వరగా ముఖం కడుక్కుంది. కాఫీ తాగేసింది. స్నానం చేసేసింది. చీరె ఇస్త్రీ చేసుకుంటూ వుంది.

ఇంటర్వ్యూలో యే ప్రశ్నలు అడుగుతారో! డిగ్రీఅయిన తర్వాత వుద్యోగాన్ని వెతకటం ప్రారంభించి రెండు సంవత్సరాలు అయింది. ఇంటర్వ్యూ యిది 36. అయినా భయం మాత్ర పోవటంలేదు. గుండెదడ తగ్గటంలేదు. ఈసారన్నా ఈఉద్యోగమన్నావస్తే...! యెంతబాగుండు. నాలాంటి వాళ్ళు యెందరున్నారో! ఈ ఇంటర్వ్యూకిలకి వెళ్ళటంవల్ల అక్కడ గమ్మత్తు అయిన పరిచయాలు అవుతున్నాయి. తన కంటె చిన్నవాళ్ళూ పెద్దవాళ్ళూ అబ్బాయిలు అమ్మాయిలు యెక్కువ డిగ్రీలు వున్నవారు అసలు డిగ్రీలేకుండానే టెన్తుపాస్ అయి టైపూ షార్టుహేండూ పాసయినవారూ యిలా యెందరో! యెన్నెన్నో రకాలవారు కన్పిస్తూ వుంటారు. ఒక సారి కల్సినవారు మరోసారి కలవరు కానీ ఓ యువకుడు మాత్రం ప్రతి ఇంటర్వ్యూలోనూ కలుస్తున్నాడు. తను లెక్కపెట్టింది అయిదుసార్ల నుంచీ కలుస్తున్నాడు. అతను ఇవాళా వస్తాడా! యేమో! అతను ఎం.ఏ. అయినా మూడు సంవత్సరాలనుంచీ నిరుద్యోగిట. పక్కవాళ్ళు అనుకుంటూవుంటే విన్నది. అతను అందరి ముఖాల్లోకి చూస్తాడు. కానీ యెవరితోనూ మాట్లాడడు. రెండు మూడుసార్లు చూసిన తర్వాత మళ్ళా కన్పిస్తే గుర్తించి వుంటాడనుకుని తనే మొదటగా నవ్వు ముఖంతో చూసింది. అతను కళ్ళజోడులోనించి పరీక్షగా చూశాడు. చిన్నగా నవ్వి 'నమస్కారం' అన్నాడు అంతే. మరో ప్రశ్నకి అవకాశం యివ్వలేదు.

'ఎం.ఎ. కదూ గర్వం అయివుండవచ్చు. అయినా నా కెందుకు.' అనుకుంది కానీ అతన్ని పరీక్షగా చూడాలన్పిస్తుంది. యెందుకో తెలియదు. తెల్లగా పొడుగ్గా

అందంగానే వుంటాడు. టెరీకాట్ పాంటూ షర్టూ వేసుకుంటాడు. కాళ్ళకి చెప్పులూ, కళ్ళకి జోడూ అంతే చేతికి వాచ్ గానీ వుంగరంగానీ వున్నట్లు లేవు.

బహుశా మధ్యతరగతి కుటుంబంలోని వాడు అయి వుండాలి. చూడాలి ఈ రోజూ వస్తాడేమో అనుకుంటూ ఇస్త్రీ పని ముగించుకుంది.

"రేవతి ఇవాళ ఇంటర్వ్యూ వుంది కదమ్మా" తండ్రి కృష్ణారావు ఆఫీసుకి వెళ్ళబోతు అడిగాడు.

"ఔను నాన్నగారూ!"

"బస్ ఛార్జీలకి ఈ డబ్బులుంచుకో" అంటూ పదిరూపాయల కాగితం యిచ్చి వెళ్ళిపోతూ అన్నాడు "ధైర్యంగా వుండమ్మా"

రేవతి జవాబు చెప్పలేక అలాగే నిల్చుండిపోయింది.

"అన్నానికిరావే రేవతీ" తల్లి పిలిచింది.

రేవతి వంటగదిలోకి వెళ్ళి పీటమీద కూర్చుంది. తమ్ముడు ఆలస్యంగా నిద్రలేచి ఒళ్ళు తడవకుండానే స్నానం చేసి తువ్వాలు కట్టుకుని వంటగధిలోకి వచ్చాడు.

"అమ్మా టైము అయింది త్వరగా అన్నం పెట్టు" హడావుడి ప్రారంభించాడు.

"కాస్త ముందులేచి రెడీ కాకూడదూ!" విసుక్కుంది రేవతి.

" రాత్రి ఒంటిగంటవరకూ చదువుకున్నానక్కా మెలకువ రాలేదు." గబగబా అన్నం ముద్దలు మింగేస్తుంటే రేవతి గయ్యిమంది.

"ఒరేయ్ అలా మింగటం ఆరోగ్యానికి మంచిది కాదురా గోపీ.. కాస్త నెమ్మదిగా తినరా!"

"టైము అయింది. నా ఫ్రెండ్ వచ్చి వాకిట్లో నిల్చున్నాడు. వాడితోవెడితే నడవటం తప్పుతుంది. సైకిల్ వుంది వాడికి. నాన్నగార్ని నాకో సైకిల్ కొనిపెట్టమని యెన్ని సార్లు అడిగినా 'ఇప్పుడుకాదు' అంటూ వాయిదా వేస్తున్నారు." గోపీ లేచేశాడు.

"పిచ్చి సన్నాసి!" అమ్మమ్మ ప్రేమగా అనుకుంది.

"నేను కాలేజీకి వెళ్ళటానికి ప్రతిరోజూ మూడుమైళ్ళు కాలినడకన వెళ్ళినా నువ్వు ఒక్కరోజూ జాలిపడలేదుగానీ అమ్మమ్మా గోపీని చూస్తే అంత ప్రేమ ఎందుకమ్మా?" రేవతి కోపంగా అంది.

"వాడు మగబిడ్డే! వాడు ఇంతవాడు అంతఅయి ఈ ఇంటి బాధ్యత వహిస్తాడు. మీ అమ్మనీ నాన్ననీ వుద్ధరించేవాడు వాడే. వాడికీ నీకూ పోలికేమిటీ! నిన్నెంత చూసినా మరో ఇంటికి పోయేదానివేగా!"

"అమ్మమ్మా! అది పాతకాలం నాటిమాట. ఈ కాలంలో ఆడ పిల్లలు చదువుకుంటున్నారు, వుద్యోగాలు చేస్తున్నారు. అవసరం వస్తే కొడుకులానే తల్లి దండ్రులని ఆదుకుంటున్నారు. కనుక కొడుకులు యెప్పుడో వృద్ధాప్యం వచ్చినపుడు వుద్ధరిస్తారని యిప్పటినించీ వాళ్ళని అందలం ఎక్కించటం మానండి."

అమ్మమ్మకి కోపం వచ్చేసింది.

"కమలా ఓ కమలా! చూశావుటే నీ కూతురివరస!" అరిచినట్లే అంది.

"ఏమిటమ్మా... రేవతీ యేమైందే!" కమలమ్మ లోపలికి వస్తూ అంది.

"నీ కూతురినే అడుగు."

"రేవతీ! యేమిటమ్మా?"

"యేంలేదమ్మా" అంటూ జరిగినది క్లుప్తంగా చెప్పిన తర్వాత అంది.

"అమ్మమ్మా! ఎవరి సంగతో ఎప్పటి సంగతో అలా వదిలినా నీ సంగతే చెప్పు. ఇళ్ళూ, వాకిళ్ళూ పొలాలూ స్థలాలూ అంటూ మూడు తరాలకి సరిపడా ఆస్తి మూట కట్టి నీ కొడుకు లిద్దరికీ యిచ్చారు తాతయ్యా నువ్వూ. మరి తాతయ్య పోయారే అనుకో. నిన్ను నీ యిద్దరికొడుకులూ చూస్తున్నారా. చెప్పు. అక్కడ వుండలేకే కదూ యిక్కడికి వచ్చి కూతురు దగ్గర వుంటున్నావు... మరి చెప్పు."

"అనమ్మా అను, మీ ఇంటికి వచ్చానుగనుక నువ్వు యేమైనా అంటావు."

ముసలమ్మ ముక్కూ కళ్ళూ తుడుచుకోసాగింది.

కమలమ్మ కూతుర్నే కేకలు వేసింది.

"రేవతీ నీ కెందుకీ వాదన. నీపని చూసుకో."

రేవతికి నవ్వు వచ్చింది. పైకి నవ్వలేదు. నవ్వితే అమ్మమ్మ మరీ వుడు క్కుంటుందని గదిలోకి వెళ్ళి సర్టిఫికెట్లనీ సరిచూచుకుంటూ వుంది.

"కమలమ్మగారూ ఏంచేస్తున్నారూ!" రెండిళ్ళ అవతలవున్న కామేశ్వరి పెత్తనానికీ వచ్చి స్థిమితంగా కూర్చుని కబుర్ల ప్రారంభించింది.

"అయ్యో యింకా మీ భోజనం కాలేదూ! చేసిరండి కూర్చుంటాను. అన్నట్లు ఈ వార్త విన్నారా! ఆ రాజేశ్వరిగారి కూతురు కనకదుర్గలేదూ ఆ పిల్లకి పట్టుమని

పదహారేళ్ళు లేవా! సంగీతం క్లాసుకంటూ వెడుతూ వస్తూవుండగా దారిలో ఓ దర్జీ వాడితో పరిచయం అయిందట. అది ప్రేమగా మారిందట. మనసులు యిచ్చుకున్నారట, పుచుకున్నారట, అంతే గుళ్ళోకి వెళ్ళి పెళ్ళి చేసుకుని సరాసరి వచ్చేశారట."

"నిజంగా!" కమలమ్మ ఆశ్చర్యంగా చూసింది.

"పిచ్చి కమలమ్మగారూ నిజంగా నిజం. ఈ వార్త వూరంతా తెల్సింది. వింతగా చెప్పుకుంటున్నారు."

"రామ రామ! లాయరు కూతురు దర్జీని పెళ్ళాడటమా.

"దర్జీ అన్నమాటే కానీ రాబడి చాలా వుందిట."

"పిదప కాలం పిదప బుద్ధులూ, ఆడపిల్ల అంటే పన్నెడేళ్ళకే పెళ్ళిచేసి అత్తవారింటికి పంపేవారు మా కాలంలో అందువల్ల యిలాంటివి జరిగేవి కావు. పెళ్ళి చెయ్యకుండా వుద్యోగంచదువూ అంటూ వూరివెంట పోనిస్తే దర్జీవాడినీ చేసుకుంటారు. కిరస్తానీవాడినీ చేసుకుంటారు."

ముసలావిడ ఈ తరం అమ్మాయిలనీ వాళ్ళ పనులనీ తూర్పారబట్ట సాగింది. రేవతి గదిలో వుండి ఈదంతావింటూనే వుంది. అమ్మమ్మ ఈ తరం అమ్మాయిలని తేలికచేసి మాట్లాడటం భరించలేక పోయింది. అందుకే రివ్వున బైటికి వచ్చింది.

" అమ్మమ్మా ఆ పిల్ల చేసింది యేం తప్పు చెప్పు ప్రేమించింది కనుక పెళ్ళి చేసుకుంది. యిందులో తల్లితండ్రులకి అపకీర్తి యేమీలేదుగా!"

"ఇలా చేయటం నీ దృష్టిలో రైటన్నమాట!"

"రైటు." నొక్కి అంది రేవతి.

"వూ" ముసలమ్మ మూలిగింది.

"నే వెళ్ళి దుర్గకి కంగ్రాచులేషన్స్ చెప్పివస్తాను."ముసలావిడ మాట్లాడలేదు.

"నీకు టైము అవుతోంది వెళ్ళవే" కమలమ్మ కూతుర్ని హెచ్చరించింది.

"ఇంటర్వ్యూకేనా రేవతీ నీకీసారి వుద్యోగం వస్తుందమ్మా!" కామేశ్వరమ్మ జోస్యం చెప్పింది.

"వస్తే మీకు సినిమా చూపిస్తాను అత్తయ్యగారూ" అంటూ రేవతి చెప్పులు వేసుకుని బైటకి వచ్చింది. యెండ మండుతోంది. అర్ధగంట నిల్చున్న తర్వాతగానీ సిటీబస్ రాలేదు. వచ్చినది చాలా రద్దీగా వుంది అయినా తప్పదు యెక్కాలి ఎక్కేసింది. చీరెనలిగి పోతూవుంది. తలచెరిగి పోతూ వుంది.

ఇరుకులో నలిగిపోతున్న యిద్దరు చంటిపిల్లలు కేర్ కేర్ మని యేడుస్తున్నారు. వాళ్ళని వూరడించలేక తల్లులు అవస్త పడుతున్నారు.

వాళ్ళ అవస్త చూస్తూ తన అవస్త మర్చిపోయింది. ఇంతలో తను దిగివల్సిన స్టాప్ వచ్చింది. బస్‌దిగి అమ్మయ్య అనుకుంది. చేతిలో కర్చీఫ్ యెక్కడో జారి పోయింది. "హూష్" అనుకుంటూ నిట్టూర్చి నడక ప్రారంభించింది రేవతి. ఎదురెండ కావటంవల్ల ముఖానికి చెమటపడుతూ వుంది. తుడుచు కోవడానికి కర్చీఫ్ లేదు. పైట చెంగుతో అలా అలా అద్దుకుంది.

"హలో మీరూ ఇంటర్వ్యూకేనా?" వెనకనించి విన్పించింది.

రేవతి తలతిప్పి చూసింది. అతనే...అతన్ని చూడగానే ఏదో తెలియని సంతోషంగా అన్పించసాగింది. ఆశ్చర్యకరమైన విషయం అతను తనకి తానుగా పల్కరించటం.

"హలో మీరూ నాలానే.." ఆగిపోయింది రేవతి.

"అక్షరాలా అంతే. ఔనూ మీకు ఇంకా వుద్యోగం దొరక్కపోవటం విచారంగా వుంది."

రేవతితోబాటు నడుస్తూ మాట్లాడసాగాడు.

"మీకూ అంతేగా."

"ఔను అనుకోండి...కానీ మీరు ,..మీపేరు చెప్పలేదు."

"అడగలేదు అనండి. నాపేరు రేవతి! మరి... "

"నా పేరు గిరిధర్. ఈసారి మన లక్ ఎలా ఉంటుందో చూడాలి. యిక్కడిక వస్తూంటే బ్రహ్మచారి ఎదురొచ్చాడు. అతను నా వాలకం చూసి గ్రహించి బోలెడంత ధైర్యం చెప్పాడు. తను ఎవరికి ఎదురువచ్చినా వాళ్ళు బయలుదేరిన పని అయి తీరుతుందట. ఓ ఆడపిల్లకి పదేళ్ళుగా పెళ్ళి కుదరక తను శకునంగా ఎదురు వచ్చేసరికి వాళ్ళు వెళ్ళిన సంబంధం ఖాయం అయిందిట. ఆ పెళ్ళికే వెడుతున్నాడట. యిలా చాలా చెప్పి బస్‌ఛార్జీకిగాను ఓ రెండు రూపాయలు యిమ్మన్నాడు."

"నిజం!"

"నిజం! మనిషి తనమీద తను నమ్మకం పోగొట్టుకున్న సమయంలోనే యిలాంటివాళ్ళ మాటలు అయస్కాంతంలా ఆకట్టుకుంటాయి. ఈ విషయాలకేంగానీ మీరింకా ఏ వుద్యోగాలకోసమైనా ప్రయత్నిస్తున్నారా?"

"మీరు?"

గిరిధర్ రేవతి ముఖంలోకి పరీక్షగా క్షణంచూసి చిన్నగా నవ్వాడు.

"మీ ఇల్లు ఎక్కడో చెప్పండి. నే ప్రయత్నంచేసే వాటి వివరాలన్నీ మీకూ చెప్తాను."

ఎంత మంచి మనసు అనుకుంది రేవతి. తన ఇల్లు అడ్రస్ ఇస్తే ఇతను వస్తే యింకేమైనా వుందా! అమ్మమ్మ ఏవేవో అపోహలు పెంచుకుంటుంది. ఇరుగూ పొరుగూ అమ్మలక్కలు చెవుల కొరుక్కుంటారు. అమ్మ లోపల ఏమనుకుంటుందో కానీ పైకి మాత్రం ఏం మాట్లాడదు. మధ్యతరగతి ఇళ్ళలోని ఆడపిల్లలు ఎంత చదువుకున్నా వుద్యోగాలంటూ బైటకి వస్తున్నా వాళ్ళ పరిధి మాత్రం క్లుప్తంగానే వుంటోంది అనుకుంది రేవతి.

"అరె నేను మాట్లాడుతుంటే మీరు ఏదో ఆలోచనలో పడిపోయారు. ఆ వచ్చేశాం. మన సోదరసోదరీమణులు చాలా మందే వచ్చి వున్నారు. వున్నవి రెండే రెండు పోస్టులు కానీ వచ్చినవాళ్ళు అరవై డెబై మందిదాకా వున్నట్లున్నారు."

"ఇతను ఇంత సరదాగా మాట్లాడగలడా?" అనుకుంది రేవతి. ఇద్దరూ లోపలికి నడిచారు. అక్కడున్న అందరినీ ఓసారి కలయజూసింది రేవతి.

కొత్తవాళ్ళు కొందరు పాతవాళ్ళు కొందరు వున్నారు. ఒకరిని ఒకరు చూడసాగారు. కొందరు నిరుద్యోగ సమస్యని యెలా పరిష్కరించాలన్న విషయంమీద చర్చ ప్రారంభించారు.

"టైము యెంత అయిందండీ?" రేవతి పక్కనున్న ఓ అమ్మాయిని అడిగింది.

"11 గంటలు దాటింది."

"బాప్రే... ఈ వుద్యోగం వచ్చేదా చచ్చేదా! అనుకుంటూ వెళ్ళిపోయింది.ఆ అమ్మాయి.

"యింతసేపూవుండి సమయానికి వెళ్ళిపోవటం యేమిటీ" రేవతి తనలో తనే అనుకున్నట్టుగా అంది.

"ఆమె ఓ కాన్వెంట్ స్కూల్లో టీచరుగా చేస్తోంది అందుకూ."

"అలాగా! మీరు"

"నేను ఓ లాయర్ దగ్గర పార్టుటైము టైపు వర్కు చేస్తున్నాను. నెలకి ఆరు వందలు కూడారావు."

రేవతి జాలిగా చూసింది ఆ అమ్మాయి వంక. ఇంతలో ఇంటర్వ్యూ ప్రారంభమైంది. అయినా యెవరికీ ఆసక్తి లేనట్లుగా వుండిపోయారు. రేవతికి ఇంటికి

వెళ్ళిపోవాలన్పించింది. మనస్సు ఒప్పటంలేదు. ఇంతలో రేవతి పేరు పిలిచారు. లేచి ఒక్కో అడుగు వేయసాగింది. గుండె వేగంగా కొట్టుకోసాగింది. రేవతికి తనమీద తనకే కోపం వస్తోంది.

ఈ మనస్సుకి బొత్తిగా బుద్ధిలేదు. అనవసర భయాన్ని కల్గిస్తూ వుంటుంది. విసుగుని కప్పిపుచ్చుకుని లోపలికి వెళ్ళింది. పది నిమిషాల్లో బైటకి వచ్చింది. అందరూతననే ఆసక్తిగా చూడటం గమనించింది.విసుగు మరీ ఎక్కువైంది.

"రేవతిగారూ నేనూ వచ్చేవరకూ వుండండి" గిరిధర్ లోపలికి వెడుతూ చెప్పాడు. అందరూ తమనే చూస్తూన్నారు. ఆ చూడటంలో యెన్నెన్నో భావాలు కన్పిస్తున్నాయి.

"ఇతను ఈ రోజు యెందుకిలా మాట్లాడుతున్నాడు? ఈయనగారి కోసం నేనెందుకు వెయిట్ చేయాలి." చకచకా నడుస్తూ బస్‌స్టాప్ చేరుకుంది. ముఖం అంతా చెమటతో తడిసింది. పైట కొంగుతో చప్పున తుడుచుకుంది.

బస్ త్వరగా వచ్చేస్తే బాగుండు. కానీ యింటికి వెళ్ళిన దగ్గరనుంచీ తల్లి అమ్మమ్మ వేసే ప్రశ్నలు గుర్తుకొస్తే చికాకు కల్గుతుంది. వాటికి ఒపిగ్గా జవాబు చెప్పాలన్నా సాధ్యంకాదు. " ఆ వుద్యోగంరాదు. యింక మాట్లాడకండి" అనాలి. అప్పటికిగానీ వాళ్ళు ప్రశ్నలు వెయ్యటం మానరు. ఈ పరిస్థితులు నా ఒక్కదానికేనా ఇంకెవరికన్నా వుంటాయా?

'రేవతిగారూ మీరు ముందువచ్చినా బస్‌రాలేదు చూశారా. బహుశా మనం యిద్దరం యెక్కవలసిన బస్ ఒకటేనేమో! ఇంతకీ మీరే నంబర్ బస్ కోసం చూస్తున్నారు?'

రేవతి చెప్పింది........

"నాకూ అదే బస్. ఔనూ దిగే స్టాపింగూ ఒకటేఅయి వుంటుంది ఔనా!"

"కావచ్చు. కానీ మీరెలా చెప్పారు ఇంటర్వ్యూలో?"

"అడక్కండి. ఆ ఆలోచనల్లోనే తల వేడెక్కి పరచయస్తులు ఎవరూ దొరక్క మీ దగ్గర ఇలా వాగేస్తున్నాను. ఆ విషయం యిద్దరం మర్చిపోదాం."

"అంత అవేశపడుతున్నారేమిటి?"

గిరిధర్ ముఖం యింకా ఎర్రగానే వుండడం చూస్తూ అంది రేవతి.

"ఈ ఇంటర్వ్యూల తతంగం అంతా వేడుకకి వాళ్ళు చేస్తారు. కానీ మనం వేడుకకి రావటంలేదు. యెంతెంతో ఆశలు నింపుకుని వస్తూన్నాం. యిక్కడి వ్యవహారం

చూసేసరికి రక్తం వుడికెత్తి పోతుంది. సభ్యత మరిచి అరవాలనిపిస్తుంది. తిట్టాలనిపిస్తుంది. ఛావబాదేయాలన్పిస్తుంది. యిలా చేసినందువల్ల ఫలితం యేమిటి? అని మీరు అడగబోతున్నారని నాకు తెల్సు. ఫలితం వుండదు కానీ నిరుద్యోగికే తెలుస్తుందా కడుపుమంట! ఆ .... రండి మన బస్ వస్తోంది."

బస్ వచ్చి ఆగింది. ఇద్దరూ ఎక్కారు బస్ బయలు దేరింది.

'టికెట్' 'టికెట్' బస్ కండక్టర్ ఒక్కోరిదగ్గరా డబ్బులు తీసుకుని టికెట్ ఇస్తున్నాడు.

రేవతి రెండు రూపాయినోటు యిచ్చి తను దిగవల్సిన స్టాప్ చెప్పి "ఒకటి' అంది.

రెండు టికెట్లు చించి రేవతి చేతిలో పెట్టి మరొకరి దగ్గరకి నడుస్తున్నాడు కండక్టర్.

"ఒకటి అంటే రెండిచ్చావేంటీ?"

"చదువుకున్న అమ్మాయిలా కన్పిస్తున్నారు. మీరూ యిలా మాకు మస్కా యివ్వాలని చూస్తే యెలాగండి?"

రేవతికి అర్ధంకాలేదు పైగా కోపం వచ్చింది.

"ఏమిటిమీరనేది, నేను ఒక్కదాన్నే" గట్టిగా అంది.

కండక్టర్ వచ్చే ఆవేశాన్ని ఆపుకుంటూ వేలితో గిరిధర్‌వైపు చూపుతూ "ఆయన తన టికెట్ మీరిస్తారన్నారు. యిప్పుడు చెప్పండి ఆయన మీకు తెలియదా?"

రేవతి తల తిప్పి చూసింది. గిరధర్ కూర్చునే చోటులేక బెల్టు పటుకుని నిటబడి యెవరితోనే గట్టిగా వాదిస్తున్నాడు. యే విషయాన్ని గురించో.

"ఇదా విషయం. ఈయనగారు యింతకూ నావెంటరావటానికి. స్టాపులో దిగనీయి చెప్తాను. " అనుకుంది కోపంగా కండక్టర్ నవ్వుకుంటూ ముందుకు వెళ్లిపోతున్నాడు.

"చూడబోతే చాలా పెద్దమనిషిలా వున్నాడు యిదేంపని?" కోపం పోవటంలేదు రేవతి.

స్టాప్‌లో దిగేశారు. ఇద్దరూ. బస్ వెళ్ళిపోయింది. గిరిధర్ కృతజ్ఞతగా చూస్తూ న్నాడు. 'రేవతిగారూ నా టికెట్స్‌కూడా మీరిచ్చినందుకు థాంక్స్. మీకు రుణపడ్డాను. వీలైనంత తొందరలో తీర్చటానికి ప్రయత్నిస్తాను. మీరేం అనుకోకండీ!"

అతను ఈ మాటలన్నీ చెప్పలేక చెప్తున్నాడని గ్రహించింది. రేవతిలో కోపం యెగిరిపోయింది. "పర్వాలేదు ఇంతకీ మీ ఇల్లు యెక్కడ?"

గిరిధర్ నవ్వాడు. "ఇల అనకండి. ఓ చిన్నగది ఆగది అద్దె యివ్వలేక యింటి యజమాని ఆగ్రహానికి గురి అవుతున్నాను. ఈ విషయాలు సరే! మీ నాన్నగారు ఏంచేస్తుంటారు? మీ వివరాలు చెప్పండి."

రేవతి చెప్పింది.

'అదృష్టవంతులు కొంతలో కొంత. అయినా మీకు యెక్కడో అక్కడ వుద్యోగం వచ్చి తీరుతుంది."

"ఎలా చెప్పగలరు. రెండు డిగ్రీలున్న మీకు కాక నా కెలా వస్తుంది?"

"కేవలం డిగ్రీ అనికాక అమ్మాయి అనే అర్హత వల్లరావచ్చు. యిలాంటపుడు మాత్రం నేను అమ్మాయిని ఐనా యెందుకు కాలేదురా భగవంతుడా అని అనుకుంటూ వుంటాను!"

గిరిధర్ ముఖంలో మామూలు ప్రశాంతత కన్పిస్తోంది వుద్యోగం వస్తే యిలా అప్పుడప్పుడూ బస్ టికెట్‌లు కొంటూ వుంటాను."అంటూ నవ్వింది.

"ఇంతేనా కాఫీలు యిప్పించరూ!"

"రావాలిగానీ అలాగే యిప్పిస్తాను. యింతకీ"రేవతి యేదో అడగబోయి సందేహిస్తూ ఆగింది.

"చెప్పండి."

"కాఫీ తాగుదాం వస్తారా!" యెంతో ధైర్యాన్ని తెచ్చుకుంటూ అడిగింది.

"భలేవారు తెలివిగా ప్రశ్నించారు. భోజనం చేశానో లేదో అని అనుమానంతో. ఆ విషయం వదిలేద్దాం. నేను మీ బాకీ తీర్చుకోవాలి గనుక తప్పకుండా గుర్తుంచుకుంటాను. చూడండీ కాలులో ముల్లు గుచ్చుకోకుండా వుంటే ఇలా బస్ యెక్కివుండేవాడిని కాదు. అయినా భగవంతుడు ఇలా యెందుకుచేశాడో వేచి చూద్దాం వస్తాను."

అతను కుంటు కుంటూ వెళ్లిపోతున్నాడు.

"అరెరె.... ఈ విషయం ముందే గమనించలేదు. యింకా నయం అతను కృతజ్ఞత చెప్పబట్టిగానీ లేకుంటే దులిపేయాలని అనుకుంది. అలా జరిగివుంటే అతను యెంత బాధపడి వుండేవాడో! అమ్మమ్మ అన్నట్లు నాకు మాట తొందర యెక్కువ, ఇది మంచి అలవాటు కాదు." అలా అనుకుంటూ రేవతి ఇంటి వైపుగా నడక సాగించింది.

## 2

ఇల్లు చేరేసరికి ముసలామె మూలుగు విన్పిస్తోంది.

"ఏమైంది అమ్మమ్మా?" దగ్గరగా వెళ్లి పల్కరించింది రేవతి.

"కీళ్ళనొప్పులే తల్లీ. యెన్ని మందులు మింగినా తగ్గటంలేదు. నీ పెళ్ళి ఇప్పట్లో చేసేలా లేడు మీ నాన్న. ఆ పెళ్ళి చూస్తే కానీ నాప్రాణం పోయేలా లేదు. యింతకీ పని కాయా! పండా అమ్మా!"

"అది అంత త్వరగా తెలియదు అమ్మమ్మా" అంటూ లోపలికి వెళ్ళింది. తల్లి టీ యిచ్చింది. కానీ యేమీప్రశ్నించలేదు. తమ్ముడు స్కూలునించి వచ్చియేదో కావాలని మారాం చేస్తున్నాడు.

"వాడిని గారాభం చేసి పాడుచేస్తున్నావమ్మా!" విసుక్కుంది రేవతి.

"నీ కంటే యెక్కువ వాడికి నేనేం చేస్తున్నానే?"

"మగబిడ్డ మగబిడ్డ అంటూ అస్తమానం అధిక్యత యిస్తున్నారు. అది చాలదూ. వాడు గర్వంగా ఫీలవుతూ నన్ను కాస్త కూడా లక్ష్యం చెయ్యటంలేదు.

విసుక్కుంటూ తన బట్టలు మార్చుకుని స్నానానికి వెళ్లింది.

'అమ్మమ్మ లాంటి ముసలమ్మలు ఇంటింటికీ వుంటారు. వాళ్ళు వున్నంత వరకూ యిలాంటిమనవళ్ళు చెడిపోతూనే వుంటారు వెధవ గారాంతో." స్నానం చేస్తున్నా యివే ఆలోచనలు రేవతికి. తండ్రి వస్తూనే కూతురి ముఖంలోకి చూశాడు. అంతే యింక ప్రశ్నించలేదు.

భోజనాలప్పుడు వడ్డిస్తూ ఇరుగు పొరుగు వాళ్ళ ఇళ్ళలో జరిగిన కబుర్లని భర్తకి చెప్పసాగింది కమలమ్మ.

"ఎదిరింటి నాంచారమ్మ కొడుక్కి ఎప్పుడో వెళ్ళిన ఇంటర్వ్యూకి గాను మంచి వుద్యోగం వచ్చిందట. వున్న వూళ్ళో వుద్యోగం వచ్చిందని నాంచారమ్మ మురిసిపోతూ వుంది."

కృష్ణారావు మౌనంగా వింటూనే భోజనం కానిస్తున్నాడు.

"వుద్యోగ ప్రయత్నం బదులు పెళ్ళి ప్రయత్నం చేస్తే పోలా."

"పెళ్ళి అయినా ఈ కాలం ఆడపిల్లకి వుద్యోగం అవసరం వుందిగా!"

"కాలం గీలం అనకండి. ఏ కుర్రాడినో చూసి ముడేస్తే వాళ్ళ తిప్పలు వాళ్లే పడతారు." కృష్ణారావు నవ్వేశాడు ఆ నవ్వటంలో పొల మారింది. కాస్సేపటికి స్థిమితపడ్డాడు.

"పైన సంపాదించటం చేతకాని నిన్ను కట్టుకని నేను అవస్తపడుతున్నాను గనుక అల్లుడికి ఆ కష్టం తప్పిద్దామనీ."

"లంక మేతకీ ఏటి ఈతకీ సరిపోయిందన్నట్లుంది మీరు చెప్పటం."

రేవతికి ఈ సంభాషణ విసుగు అన్పించి త్వరత్వరగా భోజనం కానిచ్చి లేచి ముందు గదిలోకి వచ్చేసింది. అయినా తల్లిదండ్రులు మాటలు విన్పిస్తూనే వున్నాయి.

"రేవతి వుండగా దాని పెళ్ళి మాటలు మాట్లాడవద్దని నీకెన్నిసార్లు చెప్పాను?"

"కాని మాట ఏం అనలేదుగా"

"పెళ్ళి చెయ్యి పెళ్లి చెయ్యి అంటావు బాగానే వుంది గానీ మన దగ్గర కట్నానికీ, ఖర్చుకీ డబ్బు ఎక్కడిది?"

"లేదు. రాదు. నిజమే. మరి ఆడపిల్లని ఎన్నాళ్ళు ఉంచుకుందాం యిలా?"

"నువ్వు సగటు ఆడదానిలా మాట్లాడకు. కాలం కలిసి వస్తే అదే అవుతుంది. నా ప్రయత్నం నేను చేస్తున్నాను. కట్నం అక్కరలేదన్నవాడు దొరికితే ఎక్కడన్నాఅప్పో సప్పో తెచ్చి పెళ్ళి కానిద్దాం. మన స్థితిని మర్చి మాట్లాడకు. బస్ యింక ఆ విషయం వదిలెయ్యి."

కమలమ్మ గొంతు విన్పించలేదు మరి. కృష్ణారావు లేచి ముందు గదిలోకి వచ్చాడు.

"రేవతీ షార్టుహాండ్ అన్నా నేర్చుకోమ్మా" అన్నాడు.

"కొన్నాళ్ళు ప్రయత్నించి చూశాను నాన్నా.. బోర్ అన్పించింది.

"అలా అనుకుంటే ఎలా! సాధించాలిగానీ యివిగో చూడు పేపరు కటింగ్స్ తెచ్చాను. ఈ కంపెనీలకి అప్లికేషన్స్ పెట్టు" యిచ్చారు.

రేవతి అవిచూసి డైరీలో దాచి చాప పరుచుకుని పడుకుంది. కానీ నిద్రవచ్చేలా లేదు. "చదువుకునే రోజులే హాయిగా గడిచాయి. యిక సమస్యలు ప్రారంభమయ్యాయి. గిరిధర్‌కి బస్ ఛార్జీలకి కూడా డబ్బులు లేకపోవటం విడ్డూరంగా అన్పించలేదిపుడు. అతని పరిస్థితి నా పరిస్థితిలానే వుంది. అతనికి తల్లిదండ్రులు వున్నారో లేదో! ఈసారి కన్పిస్తే ఈ వివరాలన్నీ అడగాలి. అవునూ అతని వివరాలు తనకి ఎందుకు! తెలియదుగానీ అడగాలనిపిస్తోంది." రేవతి నిద్రపోవాలని ఆలోచనలు కట్టిపెట్టింది.

రేవతి రేషను షాపుకి వెళ్లింది. క్యూలో గంటసేపటి నుంచీ నిల్చుంది. కాళ్ళు పీకుతున్నాయి. కానీ తనముందున్న జనం కదలటం లేదు. వెధవ చక్కెర దీనికోసం యిప్పటికి మూడుసార్లుగా ఈ షాపుకి వచ్చి తిరిగి వెళ్ళింది. ఈ రోజైనా దొరుకుతుందో లేదో! వెధవ సస్పెన్స్. విసుగూ కోపం యెక్కువ అయాయి. తమ్ముడులాంటి వయస్సున్న కుర్రాళ్ళు చాలామందే ఈ క్యూలో వున్నారు. కానీ తన గోపీ మాత్రం ఈ పనికి చస్తే రాడు. అమ్మమ్మ అన్నట్లుగా వాడికేం మగమహారాజు. కనకనే ఈ ఖర్మ తప్పింది. ఆడపిల్ల కనుక తనకి తప్పలేదు. ఇంటికి వెళ్ళగానే అమ్మమ్మతో దెబ్బలాడాలి. ఇకనుంచీ గోపీనే పంచదారకి పంపేలా చేయాలి. నిశ్చయం చేసుకుంది. మరో గంట తర్వాత తనకి దొరికింది కానీ వెనకవున్నవాళ్ళు చాలామంది 'చక్కెర లేదు' అయిపోయిందనేసరికి అగ్గిలా మండిపడి షాపు యాజమానిని తిట్టి తిట్టి సంచులని తీసుకుని వెళ్ళి పోయారు. వాళ్ళలాంటి అవస్త ఈ రోజు తనకి కలగలేదు. భగవంతుడి దయవల్ల అనుకుని రేషను షాపు బైటకి వచ్చి అక్కడే వున్న కూరల షాపుల్లో కొన్ని కూరలు కూడా తీసుకుని ఇంటికి వెళ్ళటానికి బయలుదేరింది. మెయిన్ రోడ్డు దాటాలి. కానీ అది చాలా రద్దీగా వుంది. సావుగంట ఆగినా ఇటు వాళ్ళు అటు దాటలేకుండా వున్నారు. రేవతి రోడ్డు దాటే ప్రయత్నంలో వుంది.

"అక్కా కాస్త నీతోబాటు నన్నూ దాటించవూ?"

పూత కర్రల సాయంతో నడుస్తూ ఓకుంటి పిల్ల రేవతి పక్కకి వచ్చి ఆగి అడిగింది.

"అలాగేనమ్మా! మెల్లగా నా వెంట రామ్మా." రేవతి ఆ పిల్లతోబాటు మెల్లగా దాటింది.

ఆ పిల్ల రేవతి వైపు కృతజ్ఞతగా చూసి 'వస్తానక్కా' అంటూ వెళ్ళిపోయింది.

రేవతిఆ పిల్లనే చూస్తూ నిలబడింది. పాపం ఆడపిల్ల అందులోను కుంటిపిల్ల. ముఖం చక్కగా వుంది. కానీ యేం ప్రయెజనం. ఈలాంటి పిల్లకి పెళ్ళి అవుతుందా! యెవరు చేసుకుంటారు?

"రేవతిగారూ నమస్కారం బాగున్నారా! మీరివాళ కన్పిస్తే బాగుండు అనుకుంటూ నడుస్తున్నాను. అలాగే కన్పించారు" గిరిధర్ నవ్వుతూ పల్కరించాడు.

"బాగున్నాను. కానీ నిన్ననేగా మనం కల్సుకుంది. మరి బాగున్నారా అని అడుగుతారేం."

"భలేవారు. నిన్నకీ ఈ రోజుకీ తేడా వుండకూడదంటరా నిన్న నా కాలు నడవనీయలేదు. యివాళ అది తగ్గింది. పది కిలోమీటర్లు అయినా నడిచేయగలను. నిన్న నాజేబులో అర్ధ రూపాయి మాత్రమే వుంది. ఈరోజు పాతిక రూపాయలున్నాయి. యిదంతా మార్పు కాదంటారా! అన్నట్లు మీ... అంటూ షర్టు జేబులోనించి రూపాయి తీసి రేవతికి అందించబోయాడు.

రేవతి చెయ్యి చాచలేదు.

"అంత పెద్ద అప్పు యింత త్వరగా తీర్చేసి నన్ను మర్చిపోదాం అనుకుంటున్నారా?" అప్రయత్నంగానే ఈ మాట అని తర్వాత నాలిక కర్చుకుంది.

"మీరన్నమాట నిజమే అనుకోండి... కానీ ఋణగ్రస్తుడిని అవుతానేమో అని భయం."

"నేను అలా అవనీయనులెండి. యెప్పుడో కావల్సినప్పుడు అడిగితీసుకుంటాను వుంచండి."

గిరిధర్ మరోసారి చెప్పిచూశాడు. లాభంలేకపోయింది. రూపాయి మళ్ళీ షర్టు జేబులో వేసుకున్నాడు. "ఆ సంచీ మరీ బరువున్నట్లుంది" అంటూ చనువుగా చక్కెర సంచి తీసుకోబోయాడు.

"ఒద్దు... ఒద్దు" రేవతి యివ్వలేదు.

"మీ చేతిలోఅంత బరువు వుంటే నేను యిలా నడవలేను. యిది నా స్వభావానికే విరుద్ధం. మీరివ్వక తప్పదు. తీసేసుకున్నాడు. రేవతి పక్కనే నడుస్తూ నడుస్తూ మాట్లాడసాగాడు.

"నిన్నటి ఇంటర్వ్యూలో రెండు పోస్టులూ యిద్దరు అమ్మాయిలకే వచ్చాయట. వాళ్ళు ముందే రికమెండేషన్ చేయించుకుని మరీ వచ్చారుట. చూడండీ మనం యిలా వూరికే యెన్నిసార్లు వెళ్ళినా ప్రయోజనం వుండదు. కనుక ఈ వుద్యోగం కోసం కాక మరేదైనా డబ్బు సంపాదించే దారి కోసం ఆలోచిస్తున్నాను."

"ఆలోచించి నాకూ వుపాయంయేదైనాతోస్తే చెప్పండి"

"రోడ్డు పక్కన పెసరట్ల దుకాణం తెరుద్దాం అనుకుంటున్నా."

రేవతి కిలకిలా నవ్వింది.

"ఎందుకలా నవ్వుతారు."

"వుద్యోగం దొరకనప్పుడు ప్రతి నిరుద్యోగి ఆలోచనలూ యిలాగే వుంటాయేమో!"

"వుండవచ్చునేమో కానీ ఈ రోజుల్లో నిరుద్యోగి ఎదుర్కోవల్సినన్ని సమస్యలు బహుశా యిదివరలో యెవరూ యెదుర్కొని వుండరు."

"నిజం"

రేవతి తమ యిల్లు దగ్గర అవుతున్నదని గుర్తించింది.

ఇతన్ని వెళ్లిపొమ్మని చెప్పటం యెలా! ఆలోచిస్తూ వుంది.

"చాలా దూరం వచ్చారు. సంచి యివ్వండి." మెల్లగా అంది.

"యెక్కువ బరువులేదుగా. యింతకీ మీయిల్లు ఎక్కడ?"

"ఆ పక్క సందులోనే కానీ..."

గిరిధర్ రేవతి ముఖంలోకి క్షణం చూశాడు. అర్థమైనట్టుచిన్నగా నవ్వాడు.

"మీ సంచీ తీసుకోండి. వెడతాను మీ బాకీ తీరలేదు. గుర్తు వుంచుకుతీరాలి. వస్తాను." గిరిధర్ వెళ్ళిపోయాడు.

అతని ప్రతి మాటలోనూ సంస్కారం వుట్టిపడుతూన్నట్లుంది. అతని మాట్లాడుతుంటే యెన్నో సంవత్సరాల పరిచయస్తుడు మాట్లాడినట్లుగా అన్పిస్తోంది. ఎందుకు! యెవర్ని చూసినా యిలా యెప్పుడూ అన్పించలేదే! యితని లోని ప్రత్యేకత యేమై వుంటుంది. తెలియటం లేదు. ఇంతకీ నాతోనే పరిచయమా! లేక యింకా యెవరన్నా అమ్మాయిలతో పరిచయం వుందా! ఆలోచిస్తూ సందు మలుపు తిరుగుతుండగా తమ్ముడు వెనకనించి వస్తూ అడిగాడు "అక్కా ఆయనెవరు?"

రేవతి వులిక్కిపడింది. "నువ్వు ఎక్కడనించి వస్తున్నావ్?" కోపంగా అంది

వాడి నోట్లో నువ్వుగింజ నానదు అనుకుంది. అయినా చెప్పింది.

"తెల్సిన అతను. ఆ విషయం సరేగానీ నువ్వు మాట్నీనించేనా!"

"ఔను. సినిమా బాగుంది."

"నీకు డబ్బులు యెవరిచ్చారురా?"

"అమ్మమ్మ యిచ్చింది. కానీ యెవరికీ చెప్పద్దంది అమ్మకిచెప్పకక్కా. నీతో అతను యెవరో యిక్కడవరకూ మాట్లాడుతూ వచ్చాడని నేనూ చెప్పనులే!"

"నువ్వు చెప్పినా నాకు భయంలేదు కానీ నువ్వు స్కూలుమాని యిలా మాట్నీలకి వెడుతున్నావని నాన్నతో చెప్పేస్తాను."

"అక్కా అక్కా యింకోసారి యిలా చెయ్యను. ఈసారికి ఒదిలెయ్యి. నాన్నకి చెప్పకు నీకు దణ్ణం పెడతాను ఆ సంచీ యివ్వు. నేమోసుకొస్తాను."

"ఇప్పటికి నీకు ఒళ్ళు తెల్సిందన్నమాట. నాచేతిలో బరువు వున్నదన్న విషయం గ్రహించగలిగావు చాలు సంతోషం." రేవతి సంచీ యివ్వకుండానే ఇంట్లోకి వెళ్ళిపోయింది.

"అమ్మాయ్ రేవతీ! నీకు వుత్తరం వచ్చిందమ్మా." తల్లి కవరు చేతిలో పెట్టింది.

"ఈ సమయంలో యెలా వచ్చిందమ్మా" కవరు అంటూ ఆటూ తిప్పి చూస్తూ అంది.

"ఆఖరి డెలివరీ నాలుగ్గంటలకి వస్తుంటాడు పోస్ట్‌మేన్. కమలమ్మ లోపలికి వెళ్ళిపోయింది. తన స్నేహితురాలు రాధ కొత్తగా పెళ్ళి అయి భర్త దగ్గరకి వెళ్ళిపోయింది. అప్పుడప్పుడూ తన క్షేమ సమాచారాలు రాస్తూ ఉంటుంది. తన వైవాహిక జీవితంలోని ఆనందాన్ని వర్ణించి వర్ణించి రాస్తూ వుంటుంది. రాధ వుత్తరాలు చదివేప్పుడు కుతూహలంగా బాగానే ఉన్నట్లు అన్పిస్తాయి. కానీ ఆ తర్వాత యేదో విసుగ్గా మానసిక వికారాన్ని కల్గిస్తాయి. యిందువల్ల తను జవాబు రాయటం మానేసింది. అయినా రాధ మానలేదు. అప్పుడప్పుడూ ఇలా వుత్తరాలు రాస్తూనే వుంటుంది. ఈసారి యేం రాసిందో అనుకుంటూ కవరు విప్పింది.

డియర్ రేవతీ

నేను రాసిన రెండు ఉత్తరాలకీ నువ్వు జవాబు రాయలేదు. అంటే నన్ను నువ్వు మర్చిపోయి వుంటావని అనుకోనా! అది అసంభవం. అలా జరగదు. కానీ నీ జవాబుకోసం నిజంగా చాలా రోజులు యెదురుచూశానంటే నమ్ము.

ఇక్కడ నా జీవితం ఆనందంగా సాగిపోతూ వుంది. నా భర్త నన్ను యెంత ప్రేమగా చూస్తారంటే మాటల్లో చెప్పలేను. ఈవిషయం యిదివరకు చాలాసార్లు చెప్పావులేగానీకొత్త విషయాలు వుంటే రాయి అని నువ్వు ఓ వుత్తరంలో రాసినట్లు గుర్తు. ఆ విషయం ఆలస్యంగా గుర్తుకొచ్చేసింది మరి. బోర్ అనుకోకు నీ వుద్యోగ ప్రయత్నం యెంత వరకూ వచ్చింది? అయినా హాయిగా పెళ్ళిచేసుకోక మగరాయడిలా వుద్యోగం కావాలంటావు యెందుకే. ఆడది సుఖంగా బ్రతకాలంటే ఉద్యోగం జోలికి పోకూడదే తల్లి. మీ నాన్న వాళ్ళు వెతికి మగపెళ్ళివారు అడిగినంత కట్నం పోసి నీ పెళ్ళి చేయాలంటే చాలా ఆలస్యం అవవచ్చు. పోనీ నువ్వు ఎవరినన్నా చూసుకోకూడదూ! యిలా రాస్తున్నానని మండిపడకు ఆలోచించు.

రేవతికి యింక పుత్తరం చదవాలనిపించలేదు. తర్వాత పూర్తి చేయవచ్చులే అనుకుని వుత్తరం మడిచి కవరులో పెట్టేసింది. పెళ్ళి అవగానే ఈ ఆడవాళ్ళు అమ్మమ్మల్లా కబుర్లు ప్రారంభిస్తారు. ఛెత్‌అనుకుంది.

అమ్మమ్మా, మనవడూ గుసగుసలాడుకోవటం విన్పించి దగ్గరగా వెళ్ళింది.

"ఒరే గోపీ! సినిమాకి పోతానంటే చిల్లరలేదని పది రూపాయల కాయితం యిచ్చి టికెట్టు డబ్బు మాత్రము ఖర్చు చేసి మిగతా డబ్బు భద్రంగా పట్టుకురారా అని గట్టిగానే చెప్తే సరే అని మెల్లగా ఒచ్చి పది రూపాయలూ అయిపోయాయని చెప్తున్నావురా! యిదేం అన్యాయం రా వెధవా!" ముసలావిడ మెల్లని స్వరంతోనే గద్దింపుగా అడుగుతోంది.

"కాదమ్మమ్మా నా స్నేహితులు యిద్దరు నన్ను రెండు సార్లు సినిమాకి తీసుకువెళ్ళారు. మరి వాళ్ళని నేను తీసుకువెళ్ళి బదులు తీర్చుకోవద్దూ. అందుకనీ ఆ డబ్బు ఖర్చు చేసేసాను. నాకు మా నాన్న యెప్పుడన్నా యిస్తే అదినీ కిస్తానే అమ్మమ్మా."

ముసలావిడకి ఒళ్ళు మండిపోతూ వుంది. కాస్త బిగ్గరగా మాట్లాడితే కూతురుగానీ, మనవరాలుగానీ విని అసలు నువ్వు డబ్బెందుకు ఇచ్చావని తననే చివాట్లు వేస్తారని ఓ మూల భయం. మరోమూల పదేళ్ళ వెధవ సినిమా కంటూ పోయి పది రూపాయిలు ఖర్చుచేశాడని కోపం ఆవిడని దహించేస్తున్నాయి.

పాడు కాలం పాడు పిల్లలు-పైస సంపాదించగల శక్తి లేకున్నా పదిరూపాయలు యిట్టే ఖర్చు చేసేస్తారు. మా కాలంలో ఇలా యెరుగుదుమా అనుకుంది.

"అమ్మమ్మా... మళ్ళా యింకోసారి వాడికి యిలా పది రూపాయలు ఇస్తావా' రేవతి కోపాన్ని అదిమి పెట్టుకుంటూ అంది.

"విన్నావా తల్లీ! నువ్వు వినకూడదని యెంత జాగ్రత్తపడ్డా నీ చెవిన ప్రతిదీ పడుతుంది! ఏదో పసి వెధవ సరదా పడుతున్నాడని చాటుగా యిచ్చాను."

"ఇవ్వాల్టి సరదా రేపటి అలవాటుగామారుతుంది అమ్మమ్మా! అది వ్యసనంగా అయి వాడిని పెడదారులు పట్టిస్తుంది. వాడి మంచి కోరేదానివి అయితే యిలా మరెప్పుడూ యివ్వకు. ఇచ్చావా నేను వూరుకోను."

"ఇంత చిన్న విషయాన్ని అంత పెద్దగా పట్టించు కుంటావేమే రేవతీ... వాడి సంగతి వదులు నీ సంగతి నువ్వు చేసుకో."

తల్లి పిలవటంతో రేవతి లోపలికి వెళ్ళింది. గోపీ అమ్మమ్మ దగ్గరచేరి అక్క బజారులోయెవరో అబ్బాయితో మాట్లాడుతూ వస్తోంది. నేను చూశాను అని చెప్పాడని రేవతికి తెలియదు. ముసలావిడ విషయం సూటిగా అడక్కుండా కస్సూబుస్సూ మంటోంది యేమిటబ్బా అనుకుంది. గోపీ అక్కని తప్పుకు తప్పుకు తిరగసాగాడు.

రేవతి తండ్రి వచ్చేవరకూ కూర్చుని తర్వాత భోజనం చేసింది.

నిద్రరావటం లేదు. ఓ నవల తీసుకుని చదువుకోసాగింది.

## 3

పదిహేనురోజులు గడిచిపోయాయి. రేవతి మానసిక పరిస్థితి అదోలా వుంటోంది. ఓ క్షణంలో వుత్సాహం మరుక్షణంలో నిరుత్సాహం. అటు చదువూ లేక యిటు వుద్యోగమూ లేక ఇంట్లో ఖాళీగా కూర్చోవటం పరమబోర్‌గా అన్పింస్తోంది. తన పరిస్థితి ఇలా వుంటే కనిపించిన ప్రతి వాళ్ళు "ఏం చేస్తున్నావ్? వుద్యోగం దొరకలేదూ! పోనివ్వు పెళ్ళి చేసుకో" అని ఉచిత సలహా పారేసి పోతారు. పెళ్ళి అంటే అంత తేలిగ్గా అయిపోతున్నట్లు. అందునా ఈ కాలంలో. యిలాంటి విషయాలు విసుగు తెప్పిస్తున్నాయి.

కృష్ణారావు ఓ సాయంకాలం ఓ పెళ్ళి కొడుకుని తీసుకు వచ్చాడు. తీసుకు వస్తానని ముందే భార్యకి చెప్పాడు. కమలమ్మ యింకా హడావిడి పడిపోసాగింది.

"నువ్వు యిప్పుడే ఎవరికీ ఈ విషయం చెప్పకు అయితే గియితే. అన్నీ కల్సి వస్తే అప్పుడు చెప్పవచ్చు" గట్టిగా చెప్పిన తర్వాత కమలమ్మ పెదవి కదపకుండా వూరుకుంది.

ఇంక ముసలామె రేవతిని పిలిచి ఎలా ముస్తాబు అయితే బాగుంటుందో చెప్పసాగింది. తమ కాలంలో ఎలా అలంకరించేవారో వర్ణించి చెప్పింది. అంతా ఓపిగ్గా విన్నది రేవతి.

"అమ్మమ్మా నీకాలానికీ నాకాలానికీ మధ్య మూడుతరాల వ్యత్యాసం వుంది. యిది ఎంతో మార్పు తెచ్చింది. నిజం చెప్పాలంటే ఈకాలంలో కూడా యిలా పెళ్లి చూపులు వుండకూడదు. అయినా వున్నాయి. నాముందుతరం అమ్మాయిలకైనా ఈ అవస్థ తప్పాలి అనుకుంటున్నాను. ఈ పెళ్ళి చూపులంటే నాకు సరదాగా మాత్రం లేదు. గత్యంతరం లేక ఒప్పుకున్నాను."

ఆవేశాన్ని అణుచుకుంటూ శాంతంగా అని లోపలికి నడిచింది.

"అమ్మా... దాన్ని కదపకమ్మ... వూరుకో" కమలమ్మ తల్లిని బ్రతిమిలాడింది.

"నేనేమన్నానే. చక్కగా సంతోషంగా వుండాలన్నాను. ఆ వచ్చిన వాడి కంటికి యింపుగా కన్పించేలా అలంకరించు కోమన్నాను యింతేగా!"

"చూడమ్మా ఈ కాలం ఆడపిల్లల అభిప్రాయాలు నీ కాలంలోలా ఎలా వుంటాయి. ఆడపిల్ల అలంకరణకీ అందానికీ నగల తళతళలకీ ముగ్ధురాలై ఒప్పేసుకునే

కాలం కాదు ఇది. ఒకరి అలవాట్లు ఒకరు, ఒకరి వ్యక్తిత్వం ఒకరు అర్థం చేసుకుని ఆమోదం తెల్పే రోజులు."

"ఒసే కమలా నువ్వు అజ్ఞానంగా మాట్లాడకే. ఈకాలం పిల్లలు ఒకర్నిఒకరు ఒక్క పూట కాదు ఒక్కగంట పెళ్లి చూపుల్లో చూసి ఒకర్ని ఒకరు ఎలా అర్థం చేసుకోగలరే. పాతికేళ్ళు ఎవరింటి వాతావరణంలో వాళ్ళు పెరిగి పెద్దవాళ్ళు అవుతారుకదా! ఆచారాలు పద్ధతుల్లు కట్టుబాట్లు అనేవి కల్సి బ్రతుకుతుంటే అలవాటు అయేవిగానీ ముందే అంతా తెల్సుకోగలం అనుకోవటం వెర్రితనం. యాభైఏళ్ళు కల్సి కాపురాలు వెలిగించినా ఒకప్పుడు ఒకరి మనసు ఒకరు అర్థం చేసుకోలేక నొప్పించుకుంటూ మళ్ళీ వూరడించు కుంటూ కాలం గడపవల్సి వస్తుంది. అసలు భార్యా భర్త అంటే అర్థం ఈ కాలం వాళ్ళకి తెలియదే. జన్మ జన్మలకీ తల్లి తండ్రీ మొదలైనవాళ్ళు మారుతారుగానీ భార్యాభర్తలు మారరు అని వీళ్ళకి తెల్సునా! భగవంతుడు ఏ పురుషుడిని ప్రసాదిస్తే అదే మహా ప్రసాదం అనుకునివాళ్ళతోనే జీవితాన్ని ముడివేసుకుని కష్టం సుఖం పంచుకుని ఇంటాబైటా ఆడది పేరు తెచ్చుకోవాలి. మంచి ఇల్లాలుగా తల్లిగా గృహిణిగా యింకా యిలా ఎన్నో పాత్రలని వహించాలి.

ముసలావిడ వుపన్యాస ధోరణికి కమలమ్మకే నవ్వు వచ్చింది. నవ్వితే ఆవిడకి కోపం వస్తుందని నవ్వుని ఆపుకుంది. ముసలామె మళ్ళీ ప్రారంభించబోయింది.

"నాకు పని చాలా వుందమ్మా. వాళ్ళు వచ్చే వేళ అయింది." కమలమ్మ లోపలికి వెళ్ళిపోయింది.

ఇల్లంతా నీట్‌గా సర్దేసింది. వుప్మా తయారు చేసింది. టీ డికాషన్‌వేసి ముఖంకడుక్కుని బట్టలు మార్చుకుంది.

'రేవతీ! ముఖం కడుక్కుని జడ వేసుకోమ్మా" రెండు సార్లు చెప్పింది.

రేవతి ఏదో పుస్తకం పట్టుకు కూర్చుంది. కానీ చదవ బుద్ధి కావటం లేదు.

జీవితంలో పెళ్లిచూపుల ప్రహసనం ప్రారంభమైంది. ఈ అవస్థ ప్రతి అమ్మాయికీ తప్పదేమో! ప్రేమ వివాహాలకైతే యిలాంటి యిబ్బంది వుండదు. కానీ ప్రేమించటానికో అబ్బాయి దొరకాలిగా. గిరిధర్ కళ్ళలో మెదిలాడు. అతను గుర్తుకు రాగానే మనస్సు సంతోషంతో వురకలు వేస్తుంది యెందుకు! ఏమో తెలియదు అతను ఓమంచి స్నేహితుడిలా మాట్లడతాడు. అతని మాటల్లో ఆత్మీయుతాభావం వుంటుంది. యింతకుమించియింక తెలియదు.

'రేవతీ యింకా యేం చేస్తున్నావే? నాన్నగారు అన్నటైముకి వచ్చేస్తారు. చీరె మార్చుకోమ్మా."

రేవతిని తల్లి హెచ్చరించటంతో లేవక తప్పలేదు. గుండె దడదడలాడుతూ వుంది. అచ్చంగా వుద్యోగంకోసం ఇంటర్వ్యూకి వెళ్ళే అప్పటి టెన్షన్ ప్రారంభమైంది.

'ఛీ... భయపడకూడదు తనకి తనే ధైర్యం తెచ్చుకుని ముఖం కడుక్కుని జడ వేసుకుంది.

"అక్కా! అమ్మమ్మ పూవ్వులు కొని తెప్పించింది. నీకివ్వమంది."

గోపీ తెచ్చి యిచ్చాడు. అవి పెట్టుకోవాలని లేదు. అయినా ఒద్దు అనికూడా అనలేక తీసుకుంది పిచ్చి అమ్మమ్మ చాదస్తంగా మాట్లాడుతుందేగానీ మనవడన్నా, మనవరాలన్నా యెంత ప్రేమో, పెళ్ళి కొడుకు యెలాంటివాడో యెలా వున్నాడో చూడకుండానే ఈ సంబంధం కుదరాలనీ మనవరాలి పెళ్ళి వెంటనే అవాలనీ అలా చేయమనీ దేవుడికి దణ్ణం పెట్టుకుంటోంది. యెంత అమాయకురాలు. రేవతి ముస్తాబై అద్దంలో ఓసారి తన ప్రతిబింబాన్ని చూసుకుంది. చాలా సింపుల్‌గా అలంకరించుకుంది. సినీమాకి వెళ్ళేప్పుడులా కాలేజీకి వెళ్ళేలా. ఎవ్వరూ అనుకోరు పెళ్ళిచూపులు చూడబోతున్న అమ్మాయి అని. ఇలాగే వుండాలి. కానీ ఆ పెళ్ళి కొడుకుగారుయెలావస్తాడో! బహుశా నాన్నగారి నిబంధనల ప్రకారం కట్నం ఒద్దు అన్న కోవకి చెంది వుండాలి. అయితే ఫర్లేదు. వ్యక్తిత్వం వున్నవాడే అయివుండాలి.

"అమ్మా! నాన్నా వాళ్ళు ఒస్తున్నారు." గోపీ రొప్పుతూ వచ్చి చెప్తున్న మాట విప్పించింది రేవతికి. అంతే ఆలోచనలు ఆగిపోయాయి.

"ఓ ఫ్రెండ్‌ని వెంటపెట్టుకు వచ్చాడు. చూడు కమలా. ఆ తెల్లగా పొడుగ్గా వున్న అబ్బాయి. కాదు. ఆ వైట్ షర్టు వేసుకుని 'టై' కట్టుకోలా! పొట్టిగావున్నాడు. అతను పెళ్ళి కొడుకు" భార్యకి చెప్పి ముందుగదిలోకి వెళ్ళిపోయాడు కృష్ణారావు.

పెళ్ళికొడుకు ఎవరో సులభంగా గుర్తించవచ్చు అన్న మాట అనుకుంటూ తలుపు సందులోనుంచి చూడాలని ప్రయత్నించింది. స్నేహితుడు పక్కగా కూర్చున్నట్లున్నాడు సరిగ్గా కన్పించటంలేదు. టైకట్టుకున్న అబ్బాయి ముఖం సరిగ్గా కన్పించటంలేదు. తల్లి లోపలికి వస్తున్న అలికిడి అయి చప్పున పక్కకి జరిగింది.

'రేవతీ రామ్మా చూడూ అలా వెళ్ళి ఆ ఎదురుగా వేసిన కుర్చీలో నాన్న పక్క కూర్చోమ్మా. వాళ్ళకి ఎక్కువ టైము లేదుట. వెళ్ళు త్వరగా. గోపీ చేత కాఫీ టిఫీన్లు పంపిస్తానులే.

కమలమ్మ తొందర పెట్టింది. రేవతి మెల్లగా ముందు గదిలోకి వెళ్ళి తండ్రి పక్క నున్న కుర్చీలో కూర్చోబోతూ నమస్కారం అంది.

పెళ్లి కొడుక్కి పరిచయం చేశాడు కృష్ణారావు.

"మా అమ్మాయి రేవతి. ఆయన శ్రీనివాస్‌రావ్"

శ్రీనివాసరావు లేచి నిల్చుని నమస్కారం అన్నాడు. తర్వాత తన ఫ్రెండ్‌ని పరిచయం చేశాడు. "నా ఫ్రెండ్ గిరిధర్."

ఈ పేరు వింటూనే వులిక్కి పడింది రేవతి. తల తిప్పి చూసింది. సరిగ్గా యిప్పుడే గిరిధర్ కూడా రేవతివైపు చూశాడు. అతని ముఖంలో ఆశ్చర్యం. అనుకోనిది జరిగినట్లు విస్మయంగా ఓ క్షణం చూశాడు. మరుక్షణం తనని తను సంబాళించుకుని "నమస్కారం" అన్నాడు.

రేవతి తడబడుతూ "నమస్కారం" అంది. కానీ మనసు ఏదో తెలియని వుద్రేకానికి గురి అవసాగింది. ఇంత క్రితం వున్న ప్రశాంతత ఎగిరి చక్కా పోయింది.

ఇతను తనకి తెలుసు అని చెప్పాలా వద్దా!అని ఆలోచించ సాగింది. సరిగ్గా యిదే స్థితిలో గిరిధర్ కూడా వున్నాడని రేవతికి తెలియదు. గిరిధర్ ముఖంలోకి మరోసారి చూడాలని ప్రయత్నించింది రేవతి. ఎలాగో చూసింది. అతని ముఖంలో యిప్పుడు ఏ అలజడీ లేదు. స్థిమితంగా కూర్చున్నాడు. ఇంటిని ఇంటిలోని ప్రతి వస్తువునీ పరీక్షగా చూడసాగాడు. కృష్ణారావుని గమనించసాగాడు. తర్వాత పేపరు చూస్తున్నట్లుగా వుండిపోయాడు. రేవతికి ఆగదిలో ఒక్కక్షణం కూడా కూర్చో బుద్ధి కావటంలేదు. ఎంత త్వరగా లేచిపోదామా అన్పిస్తోంది. ఏదో తెలియని సిగ్గు అభిమానం దు:ఖం అన్నీ చుట్టు ముడుతున్నాయి.

ఇలా ఎందుకు జరిగింది! కళ్ళలో నీళ్ళు తిరగసాగాయి. వాటిని బైటకిరానీయ కుండా వుండటానికి ఎంతో శ్రమపడాల్సి వస్తోంది.

శ్రీనివాసరావు రెండు మూడు ప్రశ్నలు వేశాడు.

"మీ పేరు?"

"మీ వుద్యోగ ప్రయత్నం ఎంత వరకూ వచ్చింది?"

"మీకింకా చదవాలని వుందా?"

ఇవన్నీ అనవసర ప్రశ్నలే.అయినా జవాబు చెప్పక తప్పదు. గిరిధర్ రాకుండా వుంటే ఈ శ్రీనివాస్‌రావుతో మాట్లాడగలిగేది తను అనుకున్నది ఒకటి జరిగింది మరొకటి!

సరిగ్గా గిరిధర్ స్థితి యిలాగే వుంది.

స్నేహితుడు సాయంగా రమ్మంటే వచ్చాడు గానీ యిక్కడ రేవతే పెళ్ళికూతురై వస్తుందని కలలో కూడా అనుకోలేదు. చాలా చిత్రంగా జరిగింది. అనీజీగా అన్పించ సాగింది. టిఫెను ప్లేట్లు తెచ్చి యిచ్చాడు గోపీ. శ్రీనివాస రావు స్థిమితంగా కూర్చుని కబుర్లు ప్రారంభించాడు.

"మీకు సంగీతం ఒచ్చా?"

'రాదు'అన్నట్లు తల వూపింది రేవతి.

"పోనీ సినిమాపాటలు?"

'అవీ రావు' అంది కానీ రేవతి ముఖంలో అయిష్టం స్పష్టంగా కన్పింస్తోంది.

"నాకు పాటలంటే యిష్టం. నా భార్యకి సంగీతం వచ్చి వుండాలని...'

'రాస్కెల్ వెధవవాగుడు ప్రారంభించాడు' అనుకున్నాడు గిరిధర్.

గోపీ కాఫీ తెచ్చాడు.

"వుప్మా బాగుంది. ఎవరు చేశారు?" అంటూ కాఫీ కప్పు తీసుకున్నాడు.

"రేవతి కాదు" కృష్ణారావు అసహనంగా అనేశాడు.

"నాన్నా నేను లోపలికి వెడతాను' అంటూ లేచి శ్రీనివాసరావుకీ గిరిధర్‌కీ నమస్కారమన్నా చెప్పకుండా లోపలికి వెళ్ళిపోయింది రేవతి.

'ఇంకాస్సేపు వుంటే బాగుండేది. నేను అడగాలనుకున్న ప్రశ్నలు అలాగే వున్నాయి. ఈ ప్రశ్నల పత్రం తయారు చేసుకోవటానికి నాలుగురోజులు కష్టపడ్డాను. పెళ్ళి చూపులకి వస్తూ ప్రశ్నల పత్రం గిరిధర్‌కి చూపాడు. గిరిధర్ అది పూర్తిగాచదివి ముక్కలుగా చించి కిటికీలోంచి గిరాటు కొట్టి "పెళ్ళి చూపులకి వెళ్ళి యిలాంటి ప్రశ్నలు వేస్తే ఆ పిల్లనాయనో, అన్నగారో వుంటే పిచ్చివెధవ్వని గెంటనన్నా గెంటుతారు. చాచి చెంపలన్నా పగలగొడతారు. లేకుంటే విద్యార్థి జీవితంలో ఎవరినన్నా ప్రేమించారా! పెళ్ళాడాలి అనుకున్నారా! ఎవరిచేతనైనా మోసగించబడ్డారా! ఏమిటీ చెత్త ప్రశ్నలు."

గిరిధర్ విసుగ్గా లేచాడు.

"ఆగరాబాబూ రేపు నావెంట రావటానికి ఎవ్వరూలేరు. నువ్వు రావాలి." బ్రతిమలాడాడు శ్రీనివాసరావు.

"నేనా ... చస్తేరాను. నాకిలాంటివి పడవు. మరెవరి నన్నా పిలువు."

"బాబ్బాబుగా. ఓ అర్ధగంట చాలు. నాకోసంరారా బాబూ"

"చెత్త ప్రశ్నలు వెయ్యవుగా?"

"వెయ్యను కానీ నువ్వు చెప్పు. ఏ ప్రశ్నలు వెయ్యను?"

"వివాహబంధం పవిత్రమైంది. సున్నితమైంది. ఇద్దరూ అపురూపంగా కాపాడుకోవల్సింది. జీవితాంతం హాయిగా ఆనందంగా గడపవల్సింది. కానీ చౌకబారు ప్రశ్నలువేసి వాటికి అమ్మాయిలిచ్చే జవాబులబట్టి వాళ్ళ మనస్తత్వాన్ని అంచనా వేయగలం అనుకోవటం తెలివితక్కువరా"

"సరే!నువ్వు చెప్పినట్లు వింటాను."

"మరెవరినైనా తీసుకువెళ్ళు. నాకిలాంటివి గిట్టవు. నన్ను ఒదులు."

"మరెవరూ వద్దు. నువ్వే రావాలి." బలవంతం చేసి గిరిధర్‌ని ఒప్పించాడు.

ఇద్దరూ కల్సి వచ్చారు. తీరావస్తే యిక్కడ ఇలా జరిగింది. మరో పది నిమిషాలు కూర్చుని కాఫీ తాగి తర్వాత " ఇంక వస్తామండీ" అని లేచాడు.

శ్రీనివాసరావు తప్పనిసరిగా లేచి గిరిధర్ వెంట బయటకి వచ్చాడు.

"గిరీ! అమ్మాయి ఎలా వుందిరా" హుషారుగా అడిగాడు.

"ఆ ప్రశ్న నేను నిన్ను వేయవల్సినది."

"వూ! నువ్వు అడగటం లేదుగా. నేనే చెప్పేస్తున్నాను.

రేవతి నాకు చాలా నచ్చింది.

"వూ"

"కట్నం వదులకున్నా ఆ అమ్మాయికి ఏదైనా ఉద్యోగమన్నా వుండాలిరా! లేకుంటే ఎలా నా జీతం నా ఒక్కడికే చాలదు."

"వూ"

" ఈ విషయం కృష్ణారావుగార్కి కాస్త చెప్పరాబాబూ!"

"నేనా! నాకవన్నీచేతకాదు. నాకు పని వుంది. వెళ్లి వస్తాను."

గిరిధర్ చకచకా నడుస్తూ వెళ్లి పోయాడు.

గిరిధర్ శ్రీనివాసరావూ వెళ్లి పోయినతర్వాత కృష్ణారావు లోపలి గదిలోకి వచ్చాడు కానీ కమలమ్మని పెళ్లి కొడుకు ఎలా వున్నాడని అడగలేదు. కమలమ్మ తన అభిప్రాయం చెప్పలేదు. కూతురు అల్లుడు ఏం మాట్లాడుకుంటారోఅని ముసలావిడ చెవులు రిక్కిరించుకుని కూర్చుంది. ఆవిడ అలాగే కూర్చుండి పోయింది అంతే. రేవతికి చెప్పలేనంత చికాకుగా వుంది. ఇంట్లోనించి బైటకి ఎక్కడికైనా వెడితే బాగుండు అన్పించసాగింది. చీకటి పడింది. ఎక్కడికి వెళ్ళగలదు?"

## 4

రేవతి ఓ చిన్న స్కూల్లో టీచరుగా చేరింది. 500/- జీతం. అయినా ఏదో ప్రస్తుతం కాల క్షేపం అనుకుని చేరింది. ఆ స్కూల్లో తనలాంటి అమ్మాయిలు ఈ 500 రూపాయలకే నలుగురు పని చేస్తున్నారు. ఆ నలుగురిలో హైమవతి టీచర్ నచ్చింది రేవతికి. హైమవతి క్రిష్టియన్ అమ్మాయి. అందంగా హుషారుగా వుంటుంది. ఎప్పుడూ తను నవ్వుతూ చుట్టూ వున్న వారిని నవ్విస్తూ వుంటుంది. హైమవతికీ రేవతి నచ్చింది. అంతే ఇద్దరికీ స్నేహం కల్సింది.

ఈ స్కూల్లో చేరిన తర్వాత నెలరోజులు యిట్టే జరిగి పోయినట్టుగా అన్పించసాగింది. రేవతికి మొదటినెల జీతం వచ్చింది. ఈ జీతంలో ఇంట్లోఉన్న అందరికీ ఏదో ఒకటి కొనుక్కురావాలని ఆలోచించసాగింది. హైమవతిని సలహా అడిగింది.

"నేనూ బజారుకి వస్తాను రేవతీ! మాయింటికి ఒక్కసారి వెళ్ళి అక్కడ నించి పోదాం."

హైమవతి వెంట వెళ్ళింది రేవతి. వూరికి చివరగా పేదలు వుండే బస్తీలోఒకేఒక్క గదిలో వుంటూ వుంది హైమవతి తండ్రితోసహా. గదిలో వున్నది. రెండే కుర్చీలు. కొద్దిగా సామాను అయినా అంతా చక్కగా సర్దివుంది. అంతాకలయజూచి రేవతి అడిగింది.

"వుద్యోగం చేస్తున్నా యిల్లుని చక్కగా సర్దుకున్నావు హైమవతీ."

"యిదంతా సర్దింది నేను కాదు మా డాడీ"

"అలాగా! ఆయన ఎక్కడ పనిచేస్తున్నారు!"

"ఓ కంపెనీలో. చాలా చిన్న వుద్యోగం. నా జీతం డాడీ జీతం కలిపితే బొటాబొటిగా సరిపోతుంది. యింక పండగలూ అవీ వస్తే చాలా కష్టం. అప్పు చేయాలి. అప్పంటే డాడీకి యిష్టం వుండదు."

"మీ అమ్మ"

"లేదు"

"అంటే... చచ్చి....

"కాదు. లేచిపోయింది. నాన్నది చాలా మెత్తని స్వభావం. భగవంతుడు యిచ్చినదానితోనే తృప్తిగా బ్రతకాలన్న భావం కలవాడు. అమ్మకి ఈ పేదరికం అంటే అసహ్యం అడ్డదారుల్లోనైనాసరే డబ్బు సంపాదించేయాలనీ ఆ డబ్బుతో కొనుక్కోగల్గిన

సుఖాలని అనుభవింపచేయాలనీ అన్నభావాలున్న మనిషి ఇందుకే భార్యాభర్తలకి పడలేదు. రోజూ ఘర్షణ. అమ్మ అంటే నాన్నకి ప్రేమవుంది గౌరవంవుంది. తను సంపాదించగలిగిన దానిలో సుఖపెట్టాలనీ వుంది. యివేవీ అమ్మకి తృప్తి నీయలేదు. అందుకే తనకి అవన్నీ యివ్వగలడనుకున్న ఓ రెండో పెళ్లి ముసలాయనతో వెళ్ళి పోయింది. వెళ్ళేప్పుడు నన్ను తీసుకువెళ్లాలని చూసింది. కానీ నాన్న నన్ను వదల్లేదు. నేను పెద్దదాన్నిఅయిన తర్వాత నా యిష్టప్రకారంగా రమ్మని ఎన్నోసార్లు వచ్చి పిలిచింది. కానీ నేను వెళ్ళలేదు."

"ఎందుకని!"

"నా తండ్రిమీదవుండే అభిమానం ఆయన నిజాయితీ అంటే వున్న గౌరవం ఇంకా ఇంకా చాలా కారణాలున్నాయి. అన్నింటిలోకీ ముఖ్యమైన కారణం ఒకటి నాకు అర్థమైంది. నాన్న దగ్గరలేని డబ్బు ఆయన దగ్గరవుంది. కార్లూ మేడలూ నౌకర్లూ చాకర్లూ వున్నారు. కానీ ప్రేమించే మనస్సులేదు. అది నాన్న దగ్గరుంది. దీని విలువ తెల్సుకోలేక వెళ్లిపోయింది. యిప్పటి ఆమె స్థితి ఏమిటో తెల్సునా! యిక్కడికి తిరిగిరాలేదు. అక్కడ వుండలేదు. అందుకూ నన్ను అయిన దగ్గరకి చేర్చుకోవాలని ఆరాటపడుతూ వుంది. ఆమె అంటే నాకు కోపం లేదు. జాలివుంది. నాన్నకీ అంతే.

రేవతీ కొందరిజీవితాలు అలా ఎందుకు మారతాయో దేవుడికే తెలియాలి. మానాన్న అంటూవుంటారు. జీవితం మన చేతుల్లో లేదమ్మా. ఏదో అజ్ఞాత శక్తిచేత నడపబడుతూ వుంది. మనచేతిలోనే వుంటే మనం చేయాలనుకున్న ప్రతి పనీ చేయగలం. ఆనందంగా వుండగలం. కానీ అలా జరగటంలేదంటే మరి ఏమిటీ? అని ప్రశ్నిస్తారు."

రేవతి శ్రద్ధగా వినసాగింది. హైమవతి మళ్ళీ చెప్పసాగింది.

"మా నాన్న నాపెళ్ళి కోసం నాల్గుసంవత్సరాలు కష్టపడి పదివేల రూపాయలు దాచారు. యింక అల్లుడికోసం వేట సాగించసాగారు. ఏ అబ్బాయీ ఆయనకి నచ్చేవాడుకాడు. అల్లుడు దొరకలేదుకానీ తను దాచివుంచిన డబ్బు ఓ స్నేహితుడికి ప్రాణఅవసరం వచ్చిందంటే అప్పు ఇచ్చాడు. అంతే ఆ డబ్బు తిరిగిరాలేదు మాకు."

"అయ్యో" జాలిగా అంది రేవతి.

హైమవతి నిర్లిప్తంగా నవ్వింది.

"రేవతీ ఈ ప్రపంచంలో బ్రతకటానిక్కూడా కొంత తెలివి ఉండాలి. మితిమీరిన మంచితనం వుండకూడదు. నాన్న నా పెళ్ళి చేయలేడని తెల్సు. నేనే ఎవరినైనా లా

మ్యారేజ్ చేసుకోవాలని ఆలోచిస్తున్నాను. రాబర్టు అని నాకో ఫ్రెండ్ వున్నాడు. పెద్ద శ్రీమంతుడు కాదు కానీ మంచివాడే. అయితే అతను తాగుబోతు. అయినా అతన్నే పెళ్ళాడితే! అని ఆలోచిస్తున్నాను. నాకు త్వరగా పెళ్ళి కావాలి! అది సాధ్యం అయేలాలేదు. ఏం చేయను ఎవరితో చెప్పుకుని ఈ భారాన్ని దింపుకోను. రేవతీ ఎందుకో నిన్ను చూస్తే నాకు మనస్సు విప్పి చెప్పుకోవాలనిపిస్తోంది. ఈ దేశంలో ఆడపిల్లగా పుట్టకూడదు రేవతీ''

ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ హుషారుగా తిరిగే హైమవతి మనస్సులో ఇంత బాధవుండా! ఆశ్చర్యంగా చూడసాగింది రేవతి. ఉబికివచ్చే కన్నీళ్ళని బలవంతంగా ఆపుకోవాలని ప్రయత్నిస్తున్న హైమవతి చేతిని తన చేతిలోకి తీసుకుని మెల్లగా నొక్కింది.

“హైమా! బాధపడకు. దాదాపు నా స్థితీ ఇలాగే వుంది. నేను చెప్పలేదు. నువ్వు చెప్పావుఅంతే. నీవురాబర్టుని ప్రేమిచావేమో! నేను ప్రేమించాలన్నా నచ్చినవాడు ఇంతవరకూ దొరకలేదు.'' అంటున్నప్పుడు రేవతి మనస్సులో గిరిధర్ రూపం మెదలసాగింది. అతన్ని ప్రేమిస్తున్నానా! వుహులేదు. రెండుమూడుసార్లు చూసినంత మాత్రాన... అతని మాటలూ పద్ధతులూ నచ్చినంత మాత్రాన... మిగతా వివరాలు తెలియవుగా. తెలుసుకోవాలని ప్రయత్నించలేదుగా. ప్రయత్నించినా అతినికి పెళ్ళి అయిందో కాలేదో! అతనికి ఎన్ని సమస్యలున్నాయో!

హైమవతి కళ్ళు ముఖం తుడుచుకుని 'టీ' తెచ్చి ఇచ్చింది.

'పద బజారుకి పోదాం' ఇద్దరూ బయలుదేరారు. బజారుకి వచ్చారు.

“మీ నాన్నగారికి మఫ్లర్, మీ అమ్మకి పట్టుజాకెట్టు, మీ తమ్ముడికి టేబిల్ టెన్నిస్ బ్యాటు బాలూ, యింక అమ్మమ్మకి నువ్వేచెప్పు” అంది హైమవతి.

“ఖర్జూరపండు అర్ధకిలో. పళ్ళులేని అమ్మమ్మ ఖర్జూరపండు నోట్లో వేసుకుని రోజంతా చప్పరిస్తుంది.''

“గుడ్ ఐడియా. పద కొనేద్దాం” నవ్వుకుంటూ అనుకున్నవి కొనుక్కుని తిరుగు ముఖం పట్టారు.

రేవతి ఇల్లు చేరేసరికి ఏడు గంటలు దాటింది.

కమలమ్మ వాకిట్లోనే నిల్చుని కూతురి కోసం చూడసాగింది.

కృష్ణారావు యింకా యింటికి రాలేదు.

ముసలావిడ రాత్రి ఫలహారం కానిచ్చి వక్క పలుకుని చప్పరిస్తూ మంచంమీద కూర్చుని ఇంకా ఇల్లుచేరని మనవరాలిమీద కారాలూ, మిరియాలు నూరుతోంది. కూతుర్ని సాధిస్తోంది.

"ఈడొచ్చిన ఆడపిల్లని వాకిలి గడప దాటనిచ్చే వాళ్ళం కాదు మాకాలంలో. ఇదేమి కాలమో వెధవ కాలం. మగరాయుడులా తెగతిరిగి వస్తున్నారు! అయినా కమలా నీకు బొత్తిగా బుద్ధిలేదే. దానికి ఉద్యోగం ఎందుకే పెళ్లికానిచ్చి పంపిస్తే నీకెంత బరువు తగ్గుతుంది! ఎక్కడెక్కడో ఆకాశంలోకి చూడకపోతే చిన్నన్నయ్య చిన్న కొడుక్కి యిచ్చిచేస్తే పోలా"

వాడికి ఎలా యివ్వనమ్మా. చదువులేదు.రూపంలేదు గుణంలేదు. పెద్దన్నయ్య కొడుకు ఇంజనీరు వున్నాడుగా" వాడిని చేసుకోమని చెప్పలేవూ"

"ఆ... అవ్వని మాటలు చెప్పకు. వాడికి యాభైవేలు కట్నం యిస్తామని వస్తున్నారట. ఏమీ ఇవ్వలేని నీ పిల్లని ఎలా చేసుకుంటారే"

"నువ్వు చెప్పి ఒప్పించాలమ్మా"

"నా మాట వాళ్ళువింటే ఇలా నీ పంచన వుండవల్సిన గతి పట్టదుగామ్మా!"

"అలా అని వూరుకో. గానీ అలా చెయ్యి ఇలా చెయ్యి అని రేవతి ముందుసలహా యివ్వకు."

"నోరుమూసుకుంటాలే" ముసలామె కోపంగా అంది.

"అమ్మా యిక్కడ నిలబడ్డావేం నాన్న రాలేదా?" రేవతి లోపలికివస్తూ అడిగింది.

"రాలేదు గానీ నువ్వు ఎందుకింత ఆలశ్యంగా వచ్చావ్?" రేవతి నవ్వేసింది.

"విసుక్కోకమ్మా. ఈ రోజు నాకు జీతం వచ్చిందిగా. అందుకనీ".. అంటూ తెచ్చిన పాకెట్‌లు విప్పి తల్లికి తెచ్చిన జాకెట్ గుడ్డ చేతిలో పెడుతూ అంది.

"అమ్మా మంచి ఉద్యోగం వస్తే నీకు చీరె కొంటాను."

"వూ... చాలా బాగుంది" కమల కళ్ళలో తృప్తి కన్పిస్తూన్నా మాటలో అసంతృప్తి తెచ్చుకుంటూంది.

కృష్ణారావు వచ్చాడు. మఫ్లర్ తీసి తండ్రికి ఇచ్చింది.

"ఇప్పుడివన్నీ ఎందుకమ్మా" అన్నాడు.

"అక్కా నాకు ఏమి తెచ్చావ్! బాలూ బ్యాటునా! నాకు డబ్బు కావాలక్కా" రహస్యంగా అడిగాడు.

"ఎందుకూ"

"ఆమాట అడక్కు. కావాలి అంతే"

"ఎందుకో చెప్పండే యివ్వను" అంటూఅమ్మమ్మ దగ్గరకు వెళ్ళి ఖర్జూర పండు చేతిలో పెట్టింది.

"నా తల్లే బంగారు మనసమ్మా నీది! ఆ దేవుడు కరుణించి పెళ్ళికాస్తా అయితే....

చూడు రేవతీ! నా పెట్టెలో దాచిన అయిదు రూపాయల కాయితం కన్పించటంలేదే. యేమైపోయినట్లు? యిదివరకు యిలా పోలేదమ్మా... గోపీ గాడేం తీయలేదుగదా! మెల్లగా అడిగి చూడు' అంది.

అడుగుతాను గానీ నీ పెట్టెకి తాళం వేసుకో అమ్మమ్మా."

రేవతి మనసులో చికాకు ప్రారంభమైంది.

గోపీ దారితప్పుతున్నాడా! యిదే యిదే ఆలోచన. తండ్రికి తెలిస్తే గోపీని చావగొట్టేస్తాడు. కనుక మెల్లగా వీలుచూసుకుని అడగాలి అనుకుంది. కానీ నిద్ర రావటంలేదు. హైమవతి గుర్తుకు వస్తోంది. ఆమె మాటలూ గుర్తుకు వస్తున్నాయి.

నాకు పెళ్ళి కావాలని వుంది. అదెంత త్వరగా కావాలనుకుంటున్నానో అంత ఆలస్యం అవుతోంది. ఈ మాటలే మళ్ళీ మళ్ళీ మనస్సులో మెదులుతున్నాయి.

హైమలాంటి, నాలాంటి ఆడపిల్లల మూగ బాధని యెవరు అర్థం చేసుకుంటారు. ఈ సమస్య ఎప్పటికి పరిష్కారం అవుతుంది.

రాత్రి చాలా పొద్దుపోయిన తర్వాత గానీ నిద్ర పోలేదు రేవతి.

## 5

కృష్ణారావుకి శ్రీనివాస రావు చీటీ రాసిపంపాడు.

వుద్యోగం లేకున్నా మీ రేవతిని పెళ్లిచేసుకోవాలని అనుకుంటున్నాను. మీ అభిప్రాయం తెలుపవల్సింది అని.

"కమలా! విషయం విన్నావుగా. చెప్పు. జవాబు యేం రాయను?" కృష్ణారావు భార్యని అడిగాడు!

"మీకతను నచ్చాడా?"

"నా ప్రశ్నకు జవాబు చెప్పు. అనవసర ప్రశ్నలువెయ్యకు."

"శ్రీనివాసరావు కంటే అతని వెంట వచ్చినస్నేహితుడు బాగున్నాడు. అతనెవరో ఏం చదువుకున్నాడో వివరాలు కనుక్కో పోయారా!"

"కనుక్కున్నాను. అతనికి ఒక్క తల్లి తప్ప మరెవరులేరుట. యం.ఏ. చదివాడట. చాలా మంచివాడేట. కాని..."

"అన్నీ బాగున్నపుడు యింక ఆలోచించటం దేనికీ."

"అతనికి వుద్యోగంలేదు."

"ఆదేఒస్తుంది."

"ఒచ్చినా నిలుపుకుంటాడన్న ధైర్యం లేదు! యెందుకంటే అతనికి కొన్ని అభిప్రాయాలు వున్నాయి. వాటికి రాజీ పడడు. కనుకనే యిదివరకే వచ్చిన నాలుగైదు వుద్యోగాలని ఒదిలేసుకున్నాడట. యిలాంటి వాడికి పిల్లనిస్తే.."

"నిలకడలేదంటారా?"

"నిలకడ లేకపోవటం కాదు. నిజాయితీ యెక్కువ వుంది. ఈ కాలంలో వుండకూడనంత నిజాయితీ అదే అతన్ని ఒడుదుడుకులపాలు చేస్తోంది."

"పెళ్ళి అయితే యిలాంటివన్నీ పోతాయండీ"

"పోవు కమలా! పోయే పద్ధతులుకావు. యివన్నీ కాక అతను ఆర్ యస్ యస్ కార్యకర్త. ఎక్కడ కష్టం వుంటే అక్కడుంటాడు. ఎక్కడ దుఃఖం వుంటే అక్కడే వుంటాడు. ఇలా చెప్పాలంటే చాలా వున్నాయి. ఇప్పుడు చెప్పు. ఇలాంటి అతనికి పిల్లనిస్తే రేవతి అందరి ఆడపిల్లల్లా సుఖంగా బ్రతకలేదు."

"మీరుచెప్పిందీ నిజమే కానీ అబ్బాయి చూడటానికి చాలా బాగున్నాడు. రత్నంలా వున్నాడు."

కృష్ణారావు నవ్వేశాడు.

రేవతి తల్లిదండ్రుల మాటలన్నీ వింటోంది. గిరిధర్‌ని గురించి తండ్రి వివరాలు ఎలా సేకరించాడు! అనుకుని ఆశ్చర్యపోయింది. ఆరోజు పెళ్ళి చూపులకివచ్చి స్నేహితుడితో వెళ్ళిన తర్వాత అతను ఎక్కడా కనిపించలేదు. కన్పిస్తే బాగుండు అని లోలోపల అన్పిస్తోంది. అంతలోనేభయంకుడా వేస్తోంది.

పెళ్ళి చూపులు ఏమయ్యాయని ప్రశ్నిస్తే!

"ఎక్కడ కష్టం వుంటే అక్కడుంటాడు. ఎక్కడ దుఃఖం వుంటే అక్కడుంటాడు. అంత కరుణామూర్తి అతను! అయివుండచ్చు. అతని మనసు అలాంటిదే కనుక అంత అందంగా ఆకర్షణీయంగా వుంది ముఖం. ఇంతకుమించి ఏం కావాలి. ఏం వద్దు కానీ ఎక్కడ వున్నాడో.

## 6

రేవతికి బ్యాంకులో వుద్యోగం వచ్చింది. రెండేళ్ళ క్రితం పరీక్ష రాసింది. సంవత్సరం క్రితం ఇంటర్వ్యూకి వెళ్ళింది. వుద్యోగం రావచ్చు అన్న నమ్మకంతో

ఆరునెలలు పోస్టు మాన్ కోసం ఎదురు చూసింది. విసుగుపుట్టి ఎదురుచూడటం మానేసి ఒక విధంగా ఈ విషయం మర్చిపోయిన తర్వాత వుద్యోగమే రేవతిని వెదుక్కుంటూ వచ్చింది. రేవతికి కాస్సేపు నమ్మకం కలగలేదు. కల కాదుగా అనుకుంది.

"ని శ్రమ ఫలించిందే రేవతీ" అంది తల్లి.

"ఏడుకొండల వాడికి ఎన్నో ముడుపులు కట్టగా కట్టగా ఇప్పటికి నా మొర ఆలకించాడు. నిన్ను కరుణించాడు. అలాగే ఆ పెళ్లి కూడా కల్సివచ్చేలా..." ముసలామె మురిసిపోతూ అంది.

"కృషి చేస్తూ వుంటే తప్పకుండా వుంటుంది" ఫలితం అన్నాడు తండ్రి.

"నేను చెప్పలేదుటే రేవతీ నీకు ఉద్యోగం వచ్చి తీరుతుందనీ! నీ గ్రహస్థితి బాగుందనీ" నాంచారమ్మ ఈ వార్త విని ఆదరాబాదరా వచ్చి తనజోస్యం ఫలించింది అంది.

"నువ్వు వస్తుందని చెప్పిన వుద్యోగం కాదిది అత్తగారూ." రేవతి నవ్వి అంది.

"బ్యాంకులో వుద్యోగం అంటే అంతకంటే మంచిదే గామ్మా! ఏదో ఒకటి వస్తుంది అన్నాను. యింక జీతం అందుకుని సినిమా చూపించు" అంటూ వెళ్ళిపోయింది.

"అక్కా నీకు జీతం రాగానే పాకెట్‌మనీ యివ్వవేనాకూ, నాన్నగారూ, అమ్మా బొత్తిగా డబ్బివ్వటం మానేశారు" గోపీ జాలిగా చూస్తూ అడిగాడు.

'యివ్వను' అని అనబోయి తమ్ముడి ముఖం చూసి జాలిపడి...

'అలాగేరా' అంది గోపీ సంతోషంతో పొంగి పోయాడు.

ఈ సంతోషవార్త హైమవతికి ముందు చెప్పాలి అని స్కూలుకి బయలుదేరింది.

హైమవతి ఈరోజుస్కూలుకి రాలేదు.

కారణం తెలియదన్నారు.

స్కూలుకి శలవు పెట్టి హైమ యింటకి బయలుదేరింది. హైమవతి యింటి చుట్టుపక్కలున్న గుడిసెలు ఒక్కటీలేవు. క్రితం రాత్రి అవన్నీ అగ్నికి ఆహుతి అయినట్లున్నాయి. పేదవాళ్ళు చెట్లకింద తలదాచుకున్నారు. ఆడవాళ్ళూ, గర్భిణీ స్త్రీలు, ముసలివారూ, రోగిష్టులూ అందరూ యెండలో అల్లాడిపోతున్నారు.యిలాంటి వార్తలని పేపరులో చదవటం వరకే తెల్సుగానీ యిలా ప్రత్యక్షంగా చూసియెరుగదు రేవతి. మనస్సంతా అదోలా అయిపోయింది. అయ్యో.. ఆ అగ్ని దేవుడికి ఈ నిత్య

దరిద్రులే దొరికినారా! వీళ్ళు యెప్పటికి కోలుకోను. రోజుకూలితో పొట్ట గడుపుకునే నిర్భాగ్యులు.

జాలిపడసాగింది రేవతి. హైమవతి గదిలో కాలు పెట్టింది. హైమవతి మాసిపోయిన పాత చీరె కట్టుకుని నాలుగు కిలోల గోధుమ పిండి పెద్ద పళ్ళెంలో కలిపి చపాతీలు చేస్తోంది. ముఖం అంతా చెమట పట్టి వుంది. కళ్ళలో అలసట స్పష్టంగా కన్పిస్తూ వుంది. రేవతిని చూస్తూనే పిలిచింది.

"రా రేవతీ! నేనివాళ స్కూలుకి రాలేకపోయాను."

'వూఁ' వచ్చి కూర్చుంటూ అంది.

"చూశావుగా యెందరు నిరాశ్రయులయినారో! ఆహారం లేక పిల్లా జెల్లా నకనకలాడి పోతున్నారు. అందుకే ఎవరికి చేతనైన సాయం వారుచేస్తున్నారు. వుడతాభక్తిగా ఓ పదిమంది ఆకలినన్నా తీరుద్దామనీ...ఈ ప్రయత్నం. మానాన్న కూడా అదే అన్నారు."

వున్న రెండు సిల్కు చీరెలూ మార్చి మార్చి కట్టుకుని ముస్తాబై స్కూలుకి వచ్చి పిల్లలతో బాటు నవ్వుతూ తోటి వాళ్ళని నవ్విస్తూ హుషారుగా వుండే హైమలో యింత వుదార హృదయం వుందని గుర్తించటం కష్టం. ఈ హైమపని చూస్తుంటే ఎంతో ఆత్మీయంగా గర్వంగా అన్పించసాగింది.

"హైమా! నాదీ ఈ పది రూపాలయలూ వాళ్ళకి ఖర్చు చెయ్యి. యిప్పుడు నాదగ్గర యింతే వుంది." అందించింది పది రూపాయల కాగితం.

"ఓచాలు చాలు పేదలకి అవసరం వచ్చినప్పుడు సాయపడటం అన్నదే ముఖ్యం కానీ ఎంత యివ్వగలిగారు అన్నది ముఖ్యంకాదు. చెంద్రుడికో నూలుపోగు. బస్ చాలు. ఈ రొట్టెల్లోకి కూర యేదీ తెప్పించలేక చూస్తున్నాను. ఈ డబ్బు అందుకు ఖర్చుచేస్తాను. మనలానే యింకా కొందరు యిలా యేదో ఒకటి యిచ్చి ఆ దీనార్తులఆకలి తీరుస్తున్నారు. అగ్ని ప్రమాదం జరిగిందని తెలియగానేకొందరు యువకులు పరుగున వచ్చారు. వీళ్ళకి అన్నింటా సాయం చేశారు వాళ్ళలో ఒకతను....మరీ మరీ సాయం చేశాడు. ప్రాణాలకి తెగించి పసికందులనీ, వృద్ధులనీ రక్షించాడు. ఈ రక్షించటంలో అతనికీ గాయాలు అయాయి. ప్రమాదమైనవి కాదనుకో."

"యెవరతను?"

"పేరు తెలియదు కానీ ఈ పేదలు అతనికి చాలా రుణపడ్డారు."

రేవతి యిలా కాస్సేపు కూర్చొని ఇంటికి వచ్చేస్తూ చెప్పింది.

"హైమా నాకువుద్యోగం వచ్చింది బ్యాంక్‌లో."

హైమవతికి సంతోషమైపోయింది.

"అంత మంచి వుద్యోగం వస్తే ఇంత ఆలస్యంగానా చెప్పటం."

"వస్తూనే చెప్పాలనుకున్నాను. కానీ ఇక్కడ ఈ వాతావరణం..."

"ఔను. అనుకూలంగాలేదు. వుండుస్వీటు ఏదైనా.... లేదు. ఓ స్పూను చక్కెర పెడతాను" హైమవతి లేచిచక్కెర తెచ్చి రేవతిని నోరుతెరవమని నోట్లో పోసింది.

"చాలు చాలు" అంటూతింది రేవతి.

"టీ కూడా యివ్వలేకపోతున్నాను."

"ఛా...అలా అనుకోకు....వస్తాను. రేపు స్కూలుకి వస్తావుగా"

"వస్తాను" వాకిలివరకూ సాగనంపింది హైమవతి.

రేవతి ఇంటికి బయలుదేరింది. కానీ వెళ్ళబుద్ధి కావటంలేదు.

గిరిధర్ కన్పిస్తే బాగుండు. అతనికీ వార్త చెప్పాలి. విని ఏమంటాడు!

పర్సు తెరిచి చూసింది. నలభై రూపాయలు మాత్రమే వున్నాయి. అసలే బోర్‌గా వుంది ఇంటికివెడితే మరీ విసుగు ఎక్కువ అవుతుంది అనుకుని థియేటర్‌కి వెళ్ళింది.

మార్నింగ్ షో! ఏదో పాత పిక్చర్. అయినా 'క్యూ పెద్దదిగానే వుంది. 'మంచి పిక్చరే అయివుండాలి' అనుకుని టికెట్ తీసుకుని లోపలికెళ్ళి కూర్చుంది. ఆడవాళ్ళు ఎవ్వర్లూ లేరు. పోనివ్వు హాయిగా కూర్చోవచ్చు అనుకుంది. సినిమా ప్రారంభించటానికి ఇంకా టైమున్నట్లుంది. టికెట్లు తీసుకున్న కుర్రాళ్ళు ఒక్కొక్కరూ లోపలికి వస్తున్నారు.

బ్యాంక్ వుద్యోగం అంటే బాధ్యత ఎక్కువ. చాలా జాగ్రత్తగా వుండాలి. ఎలా చెయ్యగలనో! జీతం ఫర్వాలేదు గనుక యింక ఆర్థిక పరిస్థితి గురించి ఆలోచించనక్కరలేదు. ఆలోచనల్లో గమనిచంలేదుగానీ ఎవరో ఒక అతనువచ్చి సరీగ్గా పక్కనున్న కుర్చీలో కూర్చున్నాడు.

'అంత ఖాళీగా వున్నా.... ఈయన తలెత్తి పైకి చూస్తున్నాడు ఫ్యాన్ కోసమే వచ్చినట్లుగా!

రేవతి సర్దుకుని కూర్చుంటూ తలతిప్పి చూసింది. ముఖం ఎక్కడో చూసి నట్లుంది. వూ...కొన్ని ముఖాలు పరిచయం లేకున్నా ఎక్కడో చూసినట్లే వుంటాయి.

సరిగ్గా రేవతిని చూసి అతనూ అలాగే అనుకున్నాడు.

"ఒంటరిగా కూర్చున్న ఆడపిల్లలంటే ఈ మగాళ్ళ కెందుకో తేలిక భావం" కొరకొరా చూసింది. అతను సూటిగా చూడడంతో వులిక్కిపడింది

"మీరా! అరె....అనుకోకుండా కల్సుకున్నాం. నాకు చాలా సంతోషంగా వుంది. మీరుకన్పిస్తారేమో ఓమాట చెప్పాలని అబ్బబ్బ సినిమాథియేటర్లు చుట్టూపార్కుల చుట్టూ తెగ తిరుగుతున్నాననుకోండి. దేవుడి దయవల్ల ఇవాళ అనుకోకుండా కన్పించారు. ఔనూ మీవాళ్ళంతా బాగున్నారా. శ్రీనివాసరావు సంతోషంతో వుక్కిరి బిక్కిరి అవుతూ అన్నాడు.

రేవతికి చికాకుగా వుంది. అసలే బోర్‌కొట్టి ఇక్కడికి వస్తే....హాయ్ రాం. ఇక్కడ ఇతను కన్పించాలా కన్పించినా ఇంతలా వాగాలా!ఇతను ఓ ప్రశ్నతో వదిలేలాలేడు. లేచి దూరంగా వెడితే బాగుండదు. వెళ్ళకుంటే అతని ప్రశ్నలకి జవాబులు పెద్ద తలనొప్పి యిప్పుడెలా. ఆలోచనలో పడిపోయింది రేవతి.

అసలుసినిమాకియిలా ఒంటరిగా ఎప్పుడూ రాలేదు. వచ్చిన ఒక్కసారీ... యిలా....

'రేవతిగారూ! నేను మీ నాన్నగార్కి ఓ లెటర్ పంపాను. చాలా రోజులైంది. కానీ జవాబు యివ్వలేదు. కారణం.....యేమిటంటారు?"

"నాకుతెలియదు."

"నే లెటరు రాసిన విషయమా! మీనాన్న జవాబివ్వని విషయమా! యేది తెలియదు మీకు?"

'రెండూ తెలియవు."

"అలాగా! ఆశ్చర్యంగా వుందే. మీరు తెల్సుకోవాలని అనుకోవటంలేదా?"

ఇలాంటి ప్రశ్నలు వేస్తాడని తెల్సు. అందుకే తెలివిగా లేచింది రేవతి.

హల్లో రాధికా యెందుకింత ఆలస్యం చేశావ్! అంటూ యెవరో తెలియని అమ్మాయిని వుద్దేశించి మాట్లాడుతూ వెళ్లి ఆ అమ్మాయి దగ్గరికి వెళ్ళబోతూ.

"నమస్కారమండీ! నాఫ్రెండ్ నా కోసం చూస్తోంది" అంటూ జవాబుకోసం చూడకుండా వెళ్లి ఆ అమ్మాయి పక్కన కూర్చుని 'అమ్మయ్య' అనుకుంది.

"నన్నేనా మీరుపల్కరిస్తున్నారు! మీరు నాకు తెలియదే యెక్కడా ఎప్పుడూ చూసిన గుర్తు లేదే" ఆ అమ్మాయి సాగదీస్తూ మాట్లాడసాగింది.

"సారీ ! నాఫ్రెండ్ అచ్చం మీలానే వుంటుంది. అదేమో అనుకున్నాను."

"నిజం నాలా ఓ ఫ్రెండ్ వుందా! అచ్చంగా నాలానే వుంటుందంటే చూడాలని కుతూహలం కల్గుతూ వుంది. మీ అడ్రస్ యివ్వండి.'

"ఓరి భగవాన్!" నిట్టూర్చింది రేవతి.

లైట్లు ఆరిపోయాయి.

'బ్రతికాను' అనుకుంది. అయినా ఆమెపదల్లేదు. "యివ్వండి అడ్రస్" అంది.

"మీ కెందుకండీ అంత శ్రమ మీ అడ్రస్ నాకివ్వండి.నా ఫ్రెండ్‌ని తీసుకువస్తాను.'

తప్పకుండా రండి" అంటూ తన ఇంటి గుర్తులుచెప్పి "ఇక్కడికి చాలా దగ్గర" అంది.

"సరె... సినీమా చూద్దాం."

ఇద్దరూసినిమా చూడటంలో మునిగిపోయారు.

కానీ శ్రీనివాస్ మాత్రం నీరసపడిపోయాడు. అదృష్టం అందినట్లే అంది చెయిజారిపోయిందని బాధపడసాగాడు.

'ఆ స్నేహితురాలు యింకాస్త ఆలస్యంగా రాకూడదూ' పళ్ళు కొరుక్కుంటూ అనుకున్నాడు. సినీమా చూడటం మాని దూరంగా కూర్చున్న రేవతినేచూడసాగాడు.

యింతలో యిద్దరుయువకులు వచ్చి మధ్యలో కూర్చున్నారు. రేవతి యింక కన్పించలేదు.

శ్రీనివాసరావు దీర్ఘంగా నిట్టూర్పు వదిలాడు.

## 7

బ్యాంక్ వుద్యోగంలో చేరింది రేవతి. బ్యాంక్‌కి వచ్చే టప్పుడూ వెళ్ళేటప్పుడూ దారిలో ఒక్కసారన్నా గిరిధర్ కన్పిస్తాడేమో అని ఎదురుచూడసాగింది. గిరిధర్ కన్పించలేదు. అతన్ని ఒక్కసారి కల్సుకోవాలన్న కోరిక యింకా యింకా పెరగసాగింది. అతని గదికి వెడితే! బాగానే వుంటుంది. కానీ అతని గది ఎక్కడో తెలియదే. అతను ఓసారి చెప్పాడు ఆ సందులోనే వుంటున్నా... ఆ గుర్తుని గుర్తు చేసుకుంటూ వెళ్లింది. కన్పించిన ప్రతివారినీ అడిగింది.

"గిరిధర్ అనీ అతని రూము ఎక్కడ?"

అయిదారుగురు తెలియదని చెప్పారు. ఒకతను రేవతిని పరీక్షగా చూస్తూ "ఆయనతో మీకేం పనీ" అంటూ ఆరాలు అడిగాడు.

'పని వుంది. తెలిస్తే రూము చూపించండి"

"రూము చూపిస్తానుగానీ ఈ సమయంలో ఆయన వుండడు"

అంటూ రెండు సందులు తిప్పి ఓ చిన్న గది వేలితో చూపించి వెళ్ళిపోయాడు వెడుతూన్న అతన్ని వెనక్కి పిలిచి అడిగింది.

"ఆయన ఏ టైములో వుంటారు?"

"ఉదయం తొమ్మిదికి ముందు. సాయంకాలం ఏడు తర్వాతా మీపేరుచెప్పండి చెప్తాను"

"అక్కర్లేదు. నేనే వస్తాను" రేవతి బ్యాంక్‌కి వెళ్ళింది. సాయంకాలం పని వుండి వుండిపోవల్సి వచ్చింది. 'రేపు తప్పక కల్సుకుంటాను' అనుకుని ఇల్లు చేరింది. మరుసటి రోజు సాయంకాలం త్వరగా పని ముగించుకుని బైటపడి రిక్షా చేయించుకుని గిరిధర్ రూము దగ్గరికి వచ్చింది. రూము తలపులు బార్లా తెరిచి వున్నాయి.

'అమ్మయ్య దొరికారు దొరగారు' అనుకుంటూ రిక్షావాడికి డబ్బిచ్చి పంపి రూము దగ్గరగా వచ్చి చూసింది.

'టులెట్' బోర్డు వేలాడుతోంది వాకిలికి. లోపల ఓముసలాడు కునుకు తీస్తున్నాడు. రేవతి చెప్పుల చప్పుడుకు కళ్ళు తెరిచి లేచి సరిగ్గా కూర్చున్నాడు.

"గది కావాలామ్మా?" అడిగాడు.

గదిలో వున్న ఆయన ఎక్కడికి వెళ్ళారు"

"ఖాళీ చేసి ఆచివర సందులోకి మారాడు. యింతకీ మీకు."

"గది అక్కర్లేదు. ఆయనకావాలి"

"తాడూ బొంగరం లేని ఆయన నీలాంటి చాలామందికి కావాలి.

ముసలాడి గొణుగుడు సగం విన్పించలేదు.

రేవతి ఛర్రన కోపం వచ్చింది. కానీ వచ్చినపని వదిలి వీడితో తగూపడటం ఏమిటి అనుకుని వాడు చెప్పినట్లు గిరిధర్ గదిని వాకబు చేసి చేసి ఎలాగో పట్టుకోగలిగింది.

గదితాళం వేయబడి వుంది.

పక్క వాటా వాళ్ళని అడిగింది.

"తెలియదండీ! అతనికో టైము అంటూలేనట్లుంది. ఎక్కడిక్కడికో వెడుతూ వుంటాడు. వస్తుంటాడు. నిరుద్యోగి అనుకుంటా కదూ!'

"ఔను !"

"ఆయన మీకు స్నేహితుడా! చుట్టమా!"

"రెండు కాదు"

పరిచయస్తుడా!"

రేవతికి జవాబు చెప్పాలని అనిపించలేదు. పక్క వాటా ఆయన తలుపు మూసుకుని లోపలికి వెళ్లిపోయాడు. గిరిధర్‌కి నేనలా వెతుక్కుంటూన్నాని

కాస్త కూడా తెలియదు. తెలిస్తే వచ్చేస్తాడు. ఈ రోజైనా దర్శనం అవుతుందా! ఒట్టినే వెళ్లిపోవాలా!

రేవతికి నిల్చునీ నిల్చునీ కాళ్ళు లాగుతున్నాయి. కూర్చోవాలంటే చోటు మంచిగా లేదు. అసహనాన్ని అణుచుకుంటూ అలాగే నిలబడింది. తను చూస్తున్న వైపునుంచి కాక వెనక నుంచి వచ్చాడు గిరిధర్. ప్యాంటు జేబులోనించి తాళం చెవి తీసి తాళం తీస్తున్నప్పుడు చూశాడు రేవతిని.

"అరె! మీరా! బాగున్నారా! ఇలా వచ్చారేమిటి! నా కోసమేనా? మీ వాళ్లెవర్నా ఈ రోడ్డులో వున్నారా?"

"అన్ని ప్రశ్నలు వేస్తే ఎలా చెప్పను.ముందు కాసిని మంచి నీళ్ళు యివ్వండి' గది అంతా కలియచూస్తున్న రేవతి చొరవకి ఆశ్చర్యపోతూ కూజాలో నీళ్ళు గాజు గ్లాసులో పోసి అందించాడు. నీళ్ళు తాగి గ్లాసు కింద పెట్టింది రేవతి. గదిలోని సామానుని పరిశీలిస్తోంది. ఓ మడత మంచం లెదర్ కేసూ దిండూ దుప్పటీ తాడు మీద రెండు లుంగీలూ డ్రాయర్లూ బనీనులూ ఓ పాత షర్టూ, ఓ మూలగా కిరోసిన్ స్టవ్ రెండు సత్తు గిన్నెలూ రెండు హార్లిక్స్ సీసాల్లో ఏవో వూరగాయలు రెండు పాత డబ్బాలూ యివీ!

"నా రూముని పరిశీలించటం అయిందా! ఇంక మాట్లాడదాం. యింత హఠాత్తుగా నన్ను వెతుక్కుంటూ ఎందుకు వచ్చినట్లో అర్థం కావటం లేదు.

"నాకు బ్యాంక్‌లో వుద్యోగం వచ్చింది. జాయిన్ అయాను. ఈ వూళ్ళోనే.'

"నిజం?"

"నిజం."

"కంగ్రాచ్యులేషన్స్." చప్పున చెయ్యి పట్టుకుని వూపి వెంటనే నాలిక కరుచుకుని చెయ్యివదిలి "సారీ రేవతిగారూ!"అనేశాడు.

రేవతి మనసు ఆనందంతో వురకలు వేస్తోంది. అతని స్పర్శ తెలియని మధురిమని కల్గిస్తోంది అతని మాటల్లో కళ్ళలో ఏదో అయస్కాంత శక్తి తనని లాగేస్తోంది! ఆ శక్తే ఇలా ఈడ్చుకు వచ్చింది అన్పిస్తోంది.

గిరిధర్‌లోనూ అలాంటి అలజడి కల్గుతున్నట్లు గ్రహించింది రేవతి. అయితే అతను చాలా త్వరగా మామూలుగా అయిపోగలిగాడు.

"చెప్పండి. ముందు కార్యక్రమం యేమిటి? ఓ జటిల సమస్య తీరిందిగా."

"తీరింది! కానీ అసలు సమస్య అలాగే వుండిపోయిందిగా"

"ఏమిటది?" రేవతి కళ్ళలోకి చూస్తూ అడిగాడు.

"మీకు తెలియదూ" అన్నట్లు గిరిధర్ కళ్ళలోకి సూటిగా చూసింది.

గిరిధర్ ముఖంలో యే భావాన్నీ చదవలేకపోతూ వుంది.

ఇతను అర్థంచేసుకోలేదా! చేసుకున్నా తెలియనట్లు నటిస్తున్నాడా అర్థంకావట్లేదు.

"పదండి. మీకువుద్యోగం వచ్చిన శుభ సమయాన్ని పురస్కరించుకొని కాఫీ యిప్పిస్తాను."

"ఒద్దు... యిక్కడే యింకా కాస్సేపు కూర్చుందాం."

"సరె. చెప్పండి కబుర్లు,"

"యిప్పుడు మీరేం చేస్తున్నారు?"

"రెండు వుద్యోగాలు వచ్చాయి. ఒకటి వదిలేసాను. ఒకటి చేస్తున్నాను. కానీ యిదీ వుండదుఎక్కువ రోజుల అని అన్పిస్తోంది."

"యెందుకని?"

"యజమాని పద్ధతులు నాకు నచ్చలేదు. నా పద్ధతి ఆయనకి నచ్చలేదు."

"మీరే ఆయనకి ఇష్టమైనట్లు నడుచుకోవాలి."

"నిజమే. కానీ కొన్ని విషయాల్లో యెవరితోనూ రాజీపడలేను. ఇది నా బలహీనత కావచ్చు. మరేదైనా కావచ్చు."

"మరి వుద్యోగం పోతే యెలా?"

గిరిధర్ నవ్వేశాడు.

"ఆ భయం నాకెప్పుడూ లేదు" అన్నాడు.

"మీరు ఒక్కరూ వున్నారు గనుక ఫర్లేదు. రేపు పెళ్ళీ గిళ్ళీ అయితే..."

"నాలాంటి వాడిని పెళ్ళాడిన యే ఆడపిల్లా సుఖపడదు."

"యెందుకని?"

"ఇవాళ వున్న వుద్యోగం రేపు నిలవదుగా."

"పోనీ వుద్యోగం చేసుకునే అమ్మాయినే యెంచుకోండి."

"ఆమె జీతాన్ని కూడా పేదసాదలకి ఖర్చు చేస్తే కర్ర పుచ్చుకుంటుంది."

"మిమ్మల్ని ప్రేమించిన అమ్మాయి పెళ్లాడిన అమ్మాయి అలా ఎప్పుడూ అనుకోదు."

"నేను నమ్మను. పెళ్ళి అయేవరకూ భర్తే సర్వస్వం అనుకుంటుంది స్త్రీ. ఆ తర్వాత భర్తకాక మిగతావన్నీ ముఖ్యం అనుకుంటుంది. అని నా స్నేహితుడు తరచుగా చెప్తూ వుంటాడు."

రేవతి ముఖం ఎర్రబడింది. గిరిధర్ నవ్వేశాడు.

"ఉద్యోగం చేసుకునే అమ్మాయి నిరుద్యోగిని పెళ్ళాటానికి ఒప్పుకోదు కానీ వుద్యోగం చేసుకుంటూన్న అబ్బాయి నిరుద్యోగినిని చేసుకుంటానికి వెనకాడడు. ఆమె నచ్చితే సంతోషంగా బాధ్యతని తీసుకుంటాడు."

"ఆ విషయాలు అన్నీ అనవసరం. మిమ్మల్ని ఓ ఉద్యోగస్తురాలు కావాలని వస్తేమీరిచ్చే జవాబు ఏమిటి?"

"మీ యెరికలో వున్నారా!" రహస్యంగా అన్నట్లుగా అడిగాడు.

"వున్నారు"

"మీరు కాదు కదా కొంపతీసి" జోక్‌గా అన్నాడు గిరిధర్

తను కోరుకున్న సమయం రావటంతో టక్కున జవాబు చెప్పేసింది.

"ఔను. నేనే"

గిరిధర్ ఆశ్చర్యపడలేదు. ఆ విషయం ముందే గ్రహించేయటంవల్ల ఆ విషయాన్ని నవ్వులాటగా తీసుకున్నట్లుగా మాట్లాడసాగాడు.

"చూడండీ సుఖాన వున్న ప్రాణాన్ని దుఃఖాన పెట్టుకోకూడదు."

"నాకన్నీ తెల్సు. ఆలోచించే ఈనిర్ణయానికి వచ్చాను. ఇప్పుడు కావల్సింది మీ నిర్ణయం" సూటిగా చెప్పేసింది రేవతి.

"రేవతిగారూ నా జీవితాన్ని గురించి మీరు పూర్తిగా తెల్సుకోలేదులా వుంది"

"ఆ తర్వాత విచారించవల్సి వస్తుంది. ఇప్పుడు ఆవేశంలో నిర్ణయాలు తీసుకుంటే."

"నేను చిన్న పిల్లనీ కాను. అజ్ఞానినీ కాను."

"పెద్ద ఇబ్బందిలో పెట్టేశారు. ఆ విషయాలు తర్వాత ఆలోచిద్దాం. ముందు హోటల్‌కి పదండి కాఫీ ఇప్పించాలి."

రేవతి లేచింది. గిరిధర్ గది తాళం వేస్తూ వుండగా శ్రీనివాసరావు వచ్చాడు. ఇద్దరినీ చూస్తూ తెల్ల ముఖం వేశాడు. రేవతిని పల్కరించలేక పోయాడు. గిరిధర్ క్షణం కలవరపడి అంతలోనే సంబాళించుకుని తనేస్నేహితుడిని పల్కరించాడు.

'రేవతిగార్కి బ్యాంక్‌లో వుద్యోగం వచ్చిందట."

"నిజంగా" శ్రీనివాసరావు కళ్ళు సంతోషంతో మెరిశాయి అంతలోనే కోపం కూడా వచ్చింది. "అయితే నీ రూముకి రావటం ఎందుకు?"

గిరిధర్‌కి యేం జవాబు చెప్పాలో తెలియలేదు. ఆ ప్రశ్నని దాటవేసి అన్నాడు.

"శ్రీనూ రేవతిగారికి కాఫీ యిప్పిస్తున్నాను నువ్వూరా."

శ్రీనివాసరావు ముఖం నల్లగా అయిపోయింది.

'అంటే వీళ్ళిద్దరూ ముందే ప్లాన్ వేసుకున్నారన్నమాట. నేను సమయానికి రాబట్టి తప్పనిసరిగా పిలుస్తున్నారన్నమాట. లేకుంటె...యిద్దరూ హాయిగా.... కబుర్లు చెప్పుకుంటూ....' మండిపోయింది శ్రీనివాసరావుకి.

"రాను. పని వుంది" అంటూ గిర్రున తిరిగి వెళ్ళిపోతూ అనుకున్నాడు.

'గిరిధర్ నువ్వు చాలా మంచివాడివి అనుకున్నాను. ఆ గౌరవంతోనేపెళ్ళి చూపులకి తీసుకువెళ్ళాను. కానీ నీవింత మిత్రద్రోహం తలపెడతావని అనుకోలేదు. చూస్తాను. రేవతి విషయం వాళ్ళ నాన్ననే సరాసరి అడిగి తేల్చుకుంటాను'

విసురుగా వెళ్లిపోయాడు.

## 8

రేవతీ గిరిధర్‌లు మెయిన్ రోడ్డు మీదకి వచ్చారు.

ఇద్దరి మనసులూ అదోలా అయిపోయాయి. యేం మాట్లాడాలి! మాటలే కరువయినాయి.

"శ్రీనివాస్ గురించీ మీ అభిప్రాయం యేమిటో అతనికి తెలియజేయ లేదా?"

"మా నాన్నగార్కి చెప్పాను. మీరిచ్చే కాఫీ మరోసారి తాగుతాను. వెళ్ళి వస్తాను."

"అహ అలా చెయ్యకండి." గిరిధర్ వారిస్తున్నా రేవతి ఆగలేదు.

'సారీ...యేం అనుకోకండి." ఇంటికి వచ్చేసింది.

నాలుగురోజులు గడిచిపోయినాయి. ఈ రోజూ బ్యాంకు నుంచి ఇంటికి వచ్చేసరికి ఏడుగంటలు కావచ్చింది, అమ్మమ్మ కేకలు వాకిట్లోకి విన్పిస్తున్నాయి.

"ఒరే గోపీ చిన్న వెధవ్వని జాలిపడి అప్పుడప్పుడూ యేవైనా కొనుక్కోరా అనీ సినీమాలు చూడమనీ యెవరికీ తెలియకుండా డబ్బిచ్చినందుకు, నాకే శిక్ష వేస్తావురా! నా పెట్టె మారుతాళం చెవితో తెరుస్తావురా! యిలాంటి పనులు మన ఇంటా వంటా

యెప్పుడైనా వున్నాయిరా! వుండు మీ నాన్న రానీయి చెప్పి ఛావగొట్టించకపోతే నా పేరు వరలక్ష్మమ్మ కాదు."

కమలమ్మ ఇదంతా విని 'తీశావురా' అని కొడుకుని అడిగింది.

తియ్యలేదు. నాకేం తెలియదు అంటూ బుకాయిస్తున్న గోపీని నాలుగు బాదింది.

మరెప్పుడన్నా యిలాంటి పని చేశావా ప్రాణం తీస్తాను వెధవా!"

రేవతి లోపలికి వచ్చింది. అర్థంలేని గారాభం చేస్తే పర్యవసానం యిలాగే వుంటుంది అన్నది. యెవ్వరూ మాట్లాడలేదు.

కృష్ణారావు వచ్చేశాడు.

"టిఫిను యేంలేదు కదూ!" అడిగాడు.

"లేదు. ఏం చెయ్యలేదు!"

"అయితే, ఆకలిగా వుంది. భోజనం పెట్టు అని తర్వాత రేవతిని పిలిచాడు.

"ఏమ్మా నీ వుద్యోగం యెలా వుంది?"

"బానే వుంది నాన్నా,"

"వూ. మరి అప్పుడు వచ్చి చూసి వెళ్ళిన శ్రీనివాసరావుకి ఏమని చెపుదాం?'

'నాకిష్టం లేదని చెప్పండి"అయితే వేరే సంబంధం చూడండి మరి" కమలమ్మ అంది.

దీనికీ మాట్లాడలేదు.

రేవతి అక్కడనించి లేచి వచ్చేసింది.

కొన్ని రోజులు గడిచి పోయినాయి.

హైమవతి తన పెళ్ళి శుభలేక తెచ్చి యిచ్చింది రేవతికి. రేవతి వరుడు ఎవరు అన్నది చూసి,

"అరె..రాబర్ట్..ఇతన్నే చేసుకుంటున్నావా! తాగుబోతు అన్నావు."

"ఔను. తెలిసే చేసుకుంటున్నాను." హైమవతి కళ్లలో తడి.

"హైమా రాజీపడుతున్నావా?"

"రేవతీ జీవితంలో మన కిష్టమై వాటిలో కాని వాటిలో ఒక్కప్పుడు రాజీపడి తీరాలి. అయితే రాజీ పడ్డానుకదా అని నిర్లిప్తంగా వుండి పోను. అతని అలవాట్లని మార్చటానికి ప్రయత్నిస్తాను."

రేవతి స్నేహితురాలి చేతిని ఆత్మీయంగా చేతిలోకి తీసుకుని నొక్కింది.

"రాబర్టు అదృష్టవంతుడు. నీలాంటి అమ్మాయిని భార్యగా పొందుతున్నాడు. పెళ్ళికి డబ్బు ఎలా ఒచ్చింది?"

"ఎక్కువ డబ్బు ఖర్చు చేయటంలేదు. నీలాంటి అతి ముఖ్యులని నలుగురిని మాత్రమే పిలిచాను అంతే"

"మంచి పని చేశావు. ఇలాంటి మార్పులు ఇంకా ఇంకా రావాలి మన సమాజంలో."

"ఇంతకీ నీ పెళ్ళి శుభలేఖ ఎప్పుడిస్తావ్?"

"త్వరలోనే యివ్వాలనుకుంటున్నాను. ఇస్తాను కూడా"

"వరుడెవరు?"

"అన్నీ ఒకేసారి చెప్తాను. కాఫీ తాగుదువుగానిరా."

హైమవతి కాఫీ అవగానే వెళ్ళిపోయింది.

గిరిధర్ చాలా రోజులవరకూ కన్పించలేదు.బ్యాంక్‌కి తనే వస్తానని చెప్పిన వాడు అంతులేడు. రేవతి అతని గదికి వెళ్ళింది. ఓ యాభై ఏళ్ళ ముసలాయన కూర్చుని బీడీ కాలుస్తూన్నాడు.

"ఎవరు కావాలి?" అడిగాడు.

"గిరిధర్ గారు కావాలి. మీరు...."

"నేను వాడి కోసమే అంత రూరం నించి యింత దూరం రైలు చార్జీలు పోసుకుని వచ్చాను. నేను వాడి మేనమామని . అయిదుగురు ఆడపిల్లల తండ్రిని. ఒక్క ఆడపిల్లకీ పెళ్ళి చేయలేని దద్దమ్మని. ఈ ఆవారాగాడికి ఒకదాన్ని యిచ్చికట్టబెట్టాలని వచ్చాను. వీడు కూడా అందేలా లేడు. ఎప్పుడో తండ్రిపోయి తనూ తల్లీ కష్టాల్లో వున్నప్పుడు నేను ఆదుకోలేదని కోపం అందువల్లనే నన్ను గడప తొక్కనీయడు. ఎలాగో కాళ్ళా వేళ్ళాపడాలని ఒచ్చాను. అయిదెకరాల పొలాన్ని అమ్మి అమ్మి అరెకరంలోకి తెచ్చాను. అదీ వుంటుందో పోతుందో ఆ దేవుడికి తెలియాలి. అసలు వాడు ఒప్పుకుంటే అయిదుగురినీ వాడికే కట్టబెట్టి హాయిగా చదరంగం ఆడుకుంటూ కాలం వెళ్ళదీసుకుందును."

"ఓ మామయ్యా యెప్పుడొచ్చావ్. అయిదుగురు కూతుళ్ళనీ నాకు కట్టబెట్టాలని అనుకుంటున్నావు. బాగుంది. కానీ నేను యే రాజకుమారుడినీ కానుగా. అయిదుగురు భార్యలనీ చేసుకోవటానికి."

గిరిధర్ యిలా అంటూ లోపలికి వచ్చిన తర్వాత రేవతిని చూశాడు.

"అప్పుడప్పుడూ యిలా హఠాత్తుగా నా రూముకొచ్చి యిబ్బంది పెట్టేస్తున్నారు. మీకు వేయటానికి సరైన కుర్చీ వుండదు. ఇవ్వటానికి కాఫీ వుండదు" అన్నాడు.

నాకవన్నీ యేం అక్కర్లేదు. అలా బైటకిపోదాం రండి."

"వస్తాను." చెప్పులు వేసుకుంటూన్న గిరిధర్‌నీ, రేవతీని మార్చిమార్చి చూస్తూ మేనమామ అన్నాడు.

"గిరీ! ఆ అమ్మాయి యెవర్రా ?"

"ఫ్రెండ్ . నేవచ్చేసరికి ఆలస్యం కావచ్చు. నువ్వు వెళ్లిపో మామయ్యా."

"నా ఆడపిల్లల గతి యేం కానురా?"

'దానికి జవాబు చెప్పుకోవల్సింది నువ్వే." గిరిధర్ రేవతితో సహా బైటకివచ్చాడు.

"ఎక్కడికి వెడదాం అంటారు?"

"పార్కుకి" ఇద్దరూ పార్కు చేరుకుని పచ్చగడ్డిలో కూర్చున్నారు.

"నేను ఈ రోజు మీ గురించి మా నాన్నకి చెప్పేస్తాను ముందుగా మీ నిర్ణయం చెప్తే! సూటిగా ఇలా అడగటం మీకు కష్టంగా వుండచ్చు కానీ కొన్ని ఇలా అడిగి తీరాలి"

రేవతి లోలోపల వల్లించేసుకుంటూన్న మాటలు ఎలాగో పైకి అనేసింది.

"బాగా ఆలోచించుకున్నారా!"

"నన్ను వేయద్దు. మీకు మీరు వేసుకోండి. జవాబివ్వండి."

"నాకువుద్యోగం వచ్చిన తర్వాత ఆలోచిద్దాం."

"నాకు వుద్యోగం వుంది చాలు"

"రేవతీ నా జీవితం సాఫీగా సాగదు. నిన్ను సారీ మిమ్మల్ని జీవిత భాగస్వామినిగా చేసుకుంటే సుఖపెట్టగలనా లేదా అనే ఆలోచిస్తూన్నాను. నా ఆలోచనలు అలవాట్లు. మీకు ఇబ్బందిని కలగజేయవచ్చు."

"గిరిధర్ మీరు నాకు కావాలి. మీరు నావారు అయితే ఎలాంటి కష్టాన్ని అయినా భరించగలను."

'రేవతీ! నిరుద్యోగినైన నేను పెళ్ళికి ఒప్పుకోవటం అవివేకం, మీకు తెల్సినా...."సరే అంటున్నాను అంటారు అంతేగా."

గిరిధర్ ఔను అన్నట్లు చూశాడు.

రేవతి మనస్సు సంతోషంతో పొంగిపోతోంది. కళ్ళలో ఆనందభాష్పాలు. నోట మాట రావటంలేదు.

"నిజంగా నేను అదృష్టవంతురాలిని. మీరు నా అంతగా సంతోషపడటం లేదు ఎందుకని?"

"బాధ్యత సరిగా నిర్వహించగలిగిన తర్వాత కదూ సంతోషం."

రేవతి చిలిపిగా నవ్వింది. గిరిధర్ వచ్చే నవ్వుని పెదవుల మధ్య నొక్కిపట్టాడు.

"రేవతీ పెళ్ళి అతి నిరాడంబరంగా జరగాలి."

"అలాగే"

"ఇంక వెళ్ళిపోదాం."

అప్పుడేనా ఒద్దు. ఇలా కూర్చోవాలనే వుంది."

"ఆలశ్యం అయితే మీ వాళ్ళకి జవాబు చెప్పుకోవద్దూ."

ఔను. వాచీ చూసుకుని అమ్మో ఎనిమిది! లేచేసింది రేవతి.

'ఇంటివరకూ వస్తాను."

"ఒద్దు. మా సందు చివరివరకూ.....రండి చాలు."

"దేవిగారి ఆజ్ఞ"

రేవతి ఇల్లు దగ్గరికి రాగానే గిరిధర్‌కి గుడ్‌నైట్ చెప్పింది.

"గుడ్‌నైట్" వెనక్కి వెళ్ళిపోయాడు.

## 10

రేవతి తన అభిప్రాయం చెప్పేసింది తల్లి తండ్రులతో.

"నీకేమన్నా మతిపోయిందిటే! వుద్యోగస్తుడిని వదిలి నిరుద్యోగిని చేసుకుంటావా.

అవ్వ! చెప్పేవాళ్ళు లేక చెడిపోయారనీ యివేం బుద్ధులే" అమ్మమ్మ నెత్తినోరూ కొట్టుకుంది.

తల్లి "నీ యిష్టం" అంది.

"ఈ పెళ్ళికి నేను ఒప్పుకోను. భవిష్యత్తుని గురించి నువ్వు ఆలోచించటం లేదు." ఖచ్చితంగా చెప్పాడు తన అభిప్రాయం కృష్ణారావు.

యిప్పుడేం చేయాలి! ఆలోచించింది పదిరోజులు. చివరికి సూట్‌కేసు తీసుకుని గిరిధర్ రూముకి వెళ్ళిపోయింది. "నాన్న వాళ్ళు ఒప్పుకోలేదు. అందుకని వచ్చేశాను" అంది.

గిరిధర్ ఆలోచనలో పడిపోయాడు.

"యిప్పుడు యేం చేద్దాం!" అడిగాడు.

"గుడిలోకి వెళ్ళి దండల పెళ్ళి చేసుకువద్దాం. తర్వాత రెండు గదుల యిల్లు తీసుకుని కాపురం వుందాం"అంది.

రేవతి యిష్టప్రకారమే గుడిలో పెళ్ళి జరిగిపోయింది. గిరిధర్ స్నేహితులు కొందరు వచ్చారు. రేవతి హైమవతిని తప్ప మరెవరినీ పిలవలేదు. పెళ్ళి అయి రూముకి వచ్చిన తర్వాత హైమవతి భర్తతోబాటు వచ్చింది. ఓ జాకెట్ గుడ్డ పళ్ళూ యిచ్చింది.

"జీవితంలో మనకి మనంగా సహచరులని యెంచుకున్నాం. అయితే జాగ్రత్తగా ముందుకి సాగాలి. రేవతీ! యెందుకంటే మనలాంటి వారికి పెద్దల సహకారం వుండదు. సానుభూతి అసలే వుండదు. యే ఒడిదుడుకులు యెదురైనా మనమే స్థయిర్యంగా నిలబడగలగాలి. భగవంతుడు మీకు శుభం కలగజేయుగాక. వస్తాం" అని వెళ్లిపోయింది.

గిరిధర్ భర్తగా లభించాడని ఒకవైపు సంతోషం. తల్లిదండ్రులున్నా లేనిదానిలా ఒక్కర్తీ యిలా పెళ్లి చేసుకోవల్సి వచ్చిందని మరోవైపు బాధగా అన్పించసాగింది.

మొదటి రాత్రి గిరిధర్ రేవతిని దగ్గరగా తీసుకుంటూ అన్నాడు.

"రేవతీ మన వైవాహిక జీవితం చిత్రంగా ప్రారంభం అయింది కదూ."

"ఔను. ఇందుకు నాకు బాధగా లేదు. కానీ మీకు"

గిరిధర్ నవ్వేశాడు.

"నాకు నువ్వూ నీకు నేనూ వున్నాంగా. ఈ భావం ఎంత ఆనందాన్నో ఎంత తృప్తినో యిస్తోంది. నీకు...."

"నాకు అంతే. మాటలలో చెప్పలేని మధురమైన భావాలు ఎన్నెన్నో మనసులో సందడి చేస్తున్నాయి."

గిరిధర్ రేవతిని ఇంకా ఇంకా దగ్గరగా లాక్కున్నాడు. రేవతి అతని బాహువుల్లో ఒరిగిపోయింది.

ఇంతలో వాకిలి తలుపు చప్పుడైంది. ఒక్కక్షణం ఆ శబ్దాన్ని వింటూ వుండిపోయి తర్వాత లేచి వెళ్లి తలుపు తెరిచాడు.

"గిరి బాబూ మీరు ఆసుపత్రిలో చేర్పించిన అభాగ్యురాలు రాధమ్మ ఆఖరు ఘడియల్లో వుంది. ఒక్కసారి మిమ్మల్ని చూడాలంటోంది. యివాళప్పుడు రాకూడదు. మిమ్మల్ని పిలవకూడదు అనుకున్నాం. కానీ తప్పలేదు బాబూ"

"ఫర్లేదుగానీ రాధమ్మ పరిస్థితి నిన్న బానే వుందే."

"వుంది. కానీ ఈ రోజు పరిస్థితి మారింది. లాభంలేదు అన్నాడు డాక్టర్."

"ఒస్తున్నాను పదండి"అని లోపలికి వచ్చాడు.

రేవతీ ఓ ముసలామె దిక్కులేనిది ఆమెని హాస్పటల్లో చేర్చాం. పరిస్థితి బాలేదుట. నేను వెడుతున్నాను. ఎప్పటికి తిరిగి రాగలనో చెప్పలేను. సారీ రేవతీ"

గిరిధర్ బట్టలు మార్చుకుని వెళ్లిపోయాడు.

రేవతి మనసులోని సంతోషం ఎగిరి చక్కా పోయింది.

'ఈ సమయానికే ఈవార్త రావాలా! వచ్చినా ఈయన వెళ్లాలా! జీవితంలో కలలుకన్న మొదటిరాత్రి అనుభవం కంటే ఆ పనులే ముఖ్యమైనవా!"

రేవతికి కళ్లలో నీళ్ళు తిరిగాయి. తెల్లవార్లూ నిద్రపోకుండా అలా కూర్చునే వుంది. మరునటిరోజు సాయంకాలం ఏడుదాటిన తర్వాత గిరిధర్ ఇల్లు చేరాడు తడి గుడ్డలతో. ఆసుపత్రిలో పోయిన ముసలామెని సమాధిచేయించి వచ్చాడు. అతని ముఖంలో అలసట రాత్రి అంతా నిద్రలేక పోవటంతో బడలిక కన్పిస్తూ వుంది.

వంటచేసి ఇద్దరికీ వడ్డించింది రేవతి. గిరిధర్ మౌనంగా భోజనం కానిచ్చి లేచాడు.

"రేవతీ జీవితం క్షణభంగురమైనది! ఈ జీవితం కోసం మనిషి ఎంతగా వెంపర్లాడతాడు. పాపం ఆ ముసలామెకి పిల్లలూ జెల్లలూ ఎందరో వున్నారట. కానీ ఆఖరు సమయంలో ఆమె దగ్గర ఎవ్వరూ లేరు. ఆమె స్థితికి చాలా బాధ కల్గింది.

స్మశాన వైరాగ్యంలాంటి భావనలోంచి బైటకి రాలేక పోతున్నాడు గిరిధర్. రేవతికి ఇదంతా విసుగ్గా వుంది.

"ఆ విషయం వదిలి మరేదైనా చెప్పండి."

గిరిధర్ రేవతి ముఖంలోకి క్షణం చూశాడు. అంతే మౌనంగా వుండిపోయాడు. చన్నీళ్ళు తలమీద స్నానం చేయటం వల్లనో మరెందు వల్లనో మాటిమాటికీ 'హచ్చి' హచ్చి' అని తుమ్ముతున్నాడు.

రేవతి టవల్ తీసుకుని గిరిధర్ ఒత్తయిన క్రాపు తుడవసాగింది.

గిరిధర్ రేవతి చేతిని మృదువుగా నొక్కుతూ ప్రేమగా చూశాడు.

ఇదే ఇదే...నన్ను అయస్కాంతంలా ఆకర్షిస్తోంది. నన్ను జయిస్తోంది అనుకుంది లోలోపల.

"రేవతీ! చిత్రంగా ప్రారంభమైన జీవితం యెలాంటి మలుపులుతిరుగుతుందో అని ఆలోచిస్తున్నాను. నా మీద కోపం వచ్చినప్పుడల్లా సూట్‌కేస్ తీసుకుని పుట్టింటికి పారిపోతావేమో అని భయపడుతున్నానుకూడా."

రేవతి నవ్వేసింది. తర్వాత అతని యెర్రబడిన కళ్ళని చూస్తూ నుదురుమీద చెయ్యి వేసింది. వేడిగా కాలుతోంది. అతని వైపు మందలింపుగా చూస్తూ "ఒంట్లో బాగుండనప్పుడిలా చన్నీళ్ళు స్నానం చేస్తారా" అంది.

"ఇంటి దగ్గర నువ్వు వున్నావనీ నాకోసం యెదురు చూస్తూంటావని వేడినీళ్ళు స్నానానికి యిస్తావనీ గుర్తు రాలేదు అప్పుడు."

"అంటే మీ మనసులో నాకింకా స్థిరమైన చోటు లేదన్న మాట."

గిరిధర్ నవ్వేశాడు.

"వుంది. స్థిరమైన స్థానమే వుంది. రేవతీ! నా మనస్సులో వుండే భావాలు చెప్పటం అలవాటులేదంతే....నీవు నా భార్యవి కాకుంటే బహుశా జీవితాంతం బ్రహ్మచారిగా వుండిపోయేవాడిని."

"నిజంగా!'

"నిజం రేవతీ"

"అయితే నేను అదృష్టవంతురాలినే! నా జీవితంలో ఒడిదుడుకులు వుండవు.'

'రేవతీ! నిన్ను నేను అర్థించేది ఒక్కటే! నీ పరిచయం కాకముందు నాకంటూ కొంత జీవితం వుంది. అలవాట్లూ అభిప్రాయాలూ స్థిరమైనవే వున్నాయి. అవి నీకు కష్టం కల్గించి నాకు అడ్డురాకూడదు. నన్ను అర్థంచేసుకునేందుకు ప్రయత్నించు. రేవతీ! జీవితం సంగీతం వంటిది సంగీతం యెంత మధురంగా వుంటే హృదయం కూడా అంతగా రసప్లావితం అవుతుంది. జీవితమూ అంతే. అయితే ఒక్క విషయం. జీవితం ఒక నియమంలా గడవదు. అలా గడిచే జీవితంలో ఆనందం లేదేమో!

తలతుడుస్తున్న రేవతిని ముందుకు లాక్కున్నాడు. అతనిలో ఆవేశంలేదు. రేవతి కళ్ళు మూసుకుని అతని ఒడిలో తల వుంచుకుని తృప్తిగా నిట్టూర్చింది. గిరిధర్ రేవతి తల నిమురుతూ వుండిపోయాడు.

*పుస్తక ప్రపంచం (సచిత్ర మాస పత్రిక) జూలై. 1981.*